RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 17.04.2026 | సంపుటి : 12 సంచిక : 268 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

## మహిళాబిల్లు, డీలిమిటేషన్ వైపుగా

# కేంద్రం అడుగులు





### తెలంగాణలో ఎంపీ సీట్లు 17 నుంచి 26కు..

- పునర్విభజనతో రాష్ట్రంలో పెరగనున్న లోక్‌సభ స్థానాలు
- ఏపీలో 25 నుంచి 38కి పెరుగుదల
- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

2లో..

### చారిత్రక ఘట్టానికి శ్రీకారం

డివిజన్ కోరిన విపక్ష సభ్యులు..స్పీకర్ అంగీకారం

సభ ఆమోదంతో బిల్లులను ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు నేడు పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా

మిగతా 2లో..



### డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు

2లో..

- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు
- మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం
- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- పార్లమెంటులో ప్రధాని మోడీ

## మోదీ కుటిలనీతి ముందు చాణక్య నీతి కూడా

# పనికిరాదు

### మహిళ బిల్లు ముసుగులో డీలిమిటేషన్ బిల్లు :ప్రియాంక

- ప్రజాస్వామ్యంపై కేంద్రం దాడి
- పక్కా ప్లాన్ ప్రకారమే సమావేశాలు
- లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి
- మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించడం లేదన్న మల్లికార్జున ఖర్గే
- 2024లోనే ఎందుకు అమలు చేయలేదు?
- కాంగ్రెస్ నేత కెసి వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకు: అఖిలేశ్



న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ...చాణుక్యుడు కూడా ఇంత పక్కాగా ప్లాన్ చేసి ఉండలేదని అన్నారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చేసుకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే, చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్రం హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారని ఆమె అన్నారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోడీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్ధంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ

మిగతా 2లో..

### ఇదో 'బ్లాక్ బిల్'

డీలిమిటేషన్ బిల్లు కాపీని తగలబెట్టిన స్టాలిన్



2లో..



మరోసారి బయటపడ్డ బీజేపీ

### తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు:కేటీఆర్
- తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి):పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ –పాకిస్థాన్

మిగతా 2లో..

# ఇదేం అహంకారం!

తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్తాన్ విభజనతో పోల్చిన భాజపా ఎంపీ తేజస్వీ సూర్య..



న్యూఢిల్లీ(జనంసాక్షి): లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరుగుతున్న చర్చ సందర్భంగా కర్ణాటకకు చెందిన బీజేపీ యువ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ తో పోల్చారు. బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఏపీని విభజించారని ఆరోపించారు. భారత్ నుంచి పాకిస్తాన్ ను విడదీసినట్లుగా ఏపీని విభజించారని అన్నారు. ఇలాంటి విధా

#### రేవంత్ హైబ్రీడ్ మోడల్‌పైనా ఆగ్రహం

నాలతో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి హైబ్రీడ్ మోడల్ అంటూ చేస్తున్న వాదనలను తిప్పి కొట్టారు. జిఎస్‌డిపి బాగా ఉన్నప్పుడు సీట్లు పెంచితే...తగ్గితే సీట్లు తగ్గించాలా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విధానాలే ఇలా ఉంటాయని అన్నారు. ఇకపోతే తెలంగాణ సిఎం హైబ్రిడ్ మోడల్‌ను ఆయన ఫూలిష్ ఆర్యగుమెంట్‌గా అభివర్ణించారు. జిఎస్‌డిపి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. ఇది రాజ్యాంగం ప్రకారం చెల్లదని అన్నారు. విపక్షాలపై, ప్రధానంగా డీఎంకే పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హైబ్రీడ్ మోడల్‌పైనా విమర్శలు గుప్పించారు. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందంటూ డీఎంకే చేస్తున్న వాదనలను ఆయన 'మొసలి కన్నీళ్లు'గా అభివర్ణించారు. 'ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానాల కేటాయింపు జరగడం ప్రజాస్వామ్య సూత్రం' అని

మిగతా 2లో..



### రాష్ట్ర ఏర్పాటును అవమానపరిచారు

- తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం
- రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్నే అవమానిస్తారా.?
- ఆయన ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

హైదరాబాద్(జనంసాక్షి):పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని ప్రభాకర్

మిగతా 2లో..

# మీ నౌకలను ముంచేస్తాం




- మా తొలి క్షిపణికే అవన్నీ దెబ్బతింటాయి
- ఇకనైనా హర్మూజ్ దిగ్బంధనాన్ని ఆపండి
- అమెరికాకు ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్(జనంసాక్షి):చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మొహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు.'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షకభటుడిగా మారాలనుకుంటున్నారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే.. మా తొలి క్షిపణి దాడికే.. మీ నౌకలు మునిగిపోతాయి. మా క్షిపణుల దాడితో అవి ధ్వంసమవుతాయి' అని రెజాయి హెచ్చరించారు. తమ దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఇక, ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిగురించి కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరిం చారు. వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా– ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

### ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య కాల్పుల విరమణ

నేటి నుంచి ఒప్పందం అమల్లోకి : ట్రంప్



2లో..

# పెట్టుబడులతో రండి

- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే తెలంగాణ అగ్రగామి
- ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'మేడిన్ తెలంగాణ' మార్క్
- అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుం టున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది.



రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్‌ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందు కోవడం తెలంగాణ సాధించిన మరో విజ యం.ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ

మిగతా 9లో..

## సురక్షిత ప్రయాణంతో ప్రమాదాలను

# అరికట్టాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రజా పాలన

ప్రగతి ప్రణాళికలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు: డీజీపీ శివధర్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): క్షణం పాటు చేసే నిర్లక్ష్యం.. ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆ కుటుంబం మొత్తాన్ని రోడ్డున పడే స్తుంది. ఇలాంటి విషాదాలకు అడ్డుకట్ట వేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతోనే ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి అన్నారు రోడ్డు భద్రతా కార్యక్రమం అరైవ్ అలైవ్ లో భాగంగా గురువారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జిల్లా ఎస్పీ డి. జానకి ఆధ్వర్యంలో జరిగిన భారీ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమానికి డిజిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం బాలానగర్ మండలం పెద్దాయపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై 'బ్లాక్ స్పాట్'గా గుర్తించిన కూడలి వద్దకు చేరు కున్న డిజిపి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆధ్వర్యంలో వాహన దారులకు హెల్మెట్లు




మిగతా 2లో..

## నిప్పుల కొలిమిలా

# తెలంగాణ

- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 43.8 డిగ్రీల నమోదు
- రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత
- భానుడి భగభగలతోఇంటికే పరిమితమైన జనం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ వ్యాప్తంగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర, శనివారాల్లోనూ ఉత్తర, దక్షిణ తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది.మరోవైపు 19 నుంచి 23 వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యుములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్..

# వివరణ ఇవ్వండి

స్పీకర్ సహా 9 మంది ఎమ్మెల్యేలను ఆదేశించిన నహైకోర్టు

విచారణ మే 6కు వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటు వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటిం చిన 9 మంది ఎమ్మెల్యేల తో పాటు, స్వయంగా స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. వీరంతా

మిగతా 9లో..

# తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టి చూడొద్దు

**బీఆర్ఎస్ నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు చురకలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పందించారు. సూర్య వ్యాఖ్యలపై అర్థంపర్థం లేకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు బీఆర్ఎస్ నేతలు వ్యవహారిస్తున్నారని రామచంద్ర రావు మండిపడ్డారు. ఎంపీ సూర్య మాట్లాడిన దాంట్లో అంతరార్థం వేరని, బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని అన్నారు. 'తేజస్వి మాటలను భూతద్దంలో పెట్టి చూడొద్దు. ఆయన తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చలేదు. జేఏసీలో బీజేపీ భాగంగా ఉంది. బీజేపీ లేకుంటే తెలంగాణ వచ్చేదా. తెలంగాణ ఏర్పాటుపై లోక్‌సభలో జరిగిన చర్చ సమయంలో బీఆర్ఎస్ ఇద్దరు సభ్యులు లేరు. అదే సమయంలో రాష్ట్ర ఏర్పాటు ను కాంగ్రెస్ యూ టర్న్ తీసుకుంది. దీంతో అనేక మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరందరి ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా. వాజపేయి చాలా సాఫీగా ఒక్క రక్తం చుక్క పడకుండా మూడు రాష్ట్రాలు ఇచ్చారు' అని రామచంద్ర రావు గుర్తు చేశారు.

# తెలంగాణ అంటే బీజేపీకి విద్వేశం

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్, ఏప్రిల్16 (జనంసాక్షి) :** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ –పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుం దన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# అరైవ్ అలైవ్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల బారీన పడకుండా ఉండేందుకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించేలా అవగాహన కల్పించడమే "అరైవ్ అలైవ్" కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (సీఐడీ), ఉమెన్ సేఫ్టీ వింగ్, యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్ చారు సిన్హా తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో వరంగల్ పోలీస్ కమిషనరేట్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీజీపీ చారు సిన్హా, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభంలో రోడ్డు ప్రమాదాల కారణాలు, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై వీడియోలు, స్కిట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రుత్విక్ అనే బాలుడు తన తండ్రి హెల్మెట్ ధరించకపోవడంతో జరిగిన ప్రమాదంలో మరణించారని చెప్పి అందరిని ఆలోచింపజేశాడు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తామని కార్యక్రమానికి హాజరైన వాహనదారులు, బస్సు డ్రైవర్లు, సర్పంచులు, ప్రజలతో ప్రమాణం చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. సురక్షిత డ్రైవింగ్‌కు ఆదర్శంగా నిలిచిన ఉమ్మడి వరంగల్ జిల్లా డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి సత్కరించారుఈ కార్యక్రమంలో డిసిపిలు ధార కవిత, అంకిత్ కుమార్, వరంగల్ ఏఎస్పి శుభం, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎంవిఐలు వేణుగోపాల్, శోభన్ బాబు, కిషోర్ బాబు, ఇతర అధికారులు, వివిధ సంస్థల వాహనాల డ్రైవర్లు, ప్రజలు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల బైపాస్ నిర్మాణానికి రూ. 600 కోట్లు

- ట్రాఫిక్, రూరల్ పోలీస్ స్టేషన్లు కావాలి
- డీజీపీ శివధర్ రెడ్డికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి
- నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి



**జడ్చర్ల, ఏప్రిల్ 16 (జనంసాక్షి):** పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.600 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలోనే చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. గురువారం పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల మీదుగా జాతీయ రహదారులు 44, 167 వెళ్తుండటంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి బైపాస్ మంజూరు చేయాలని కోరామని, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జడ్చర్లకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. అలాగే ఆలూరు వద్ద పోలీస్ చెక్ పోస్ట్‌ను కొనసాగించాలని కోరారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తాను నిబంధనలు పాటించాలా? లేక మరోసారి ఎమ్మెల్యే కావడానికి రూల్స్ పక్కన పెట్టి మీరు చెప్పే అక్రమ సిఫార్సులు వినాలా? అని ఎమ్మెల్యే ప్రజలను సూటిగా ప్రశ్నించారు. మద్యం తాగి ప్రమాదాలు చేసినా, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించినా చర్యలు తీసుకోకుండా ఉండాలని ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. 12, 14 ఏళ్ల పిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు వారి ప్రాణాల మీదకు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మనందరి బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ జానకి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలు సరికాదు: వద్దిరాజు



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజనతో పోల్చడాన్ని బీఆర్ఎస్ పార్లమెం టరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రజలు అహింసా మార్గంలో ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం యావత్ ప్రపంచానికి తెలిసిందేనని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని మర్చిపోయి బీజేపీ ఎంపీ దేశ విభజనతో పోల్చడం దుర్మార్గమన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో కనీస అవగాహన లేకుండా మాట్లాడిన ఆయన తెలంగాణ ప్రజలను అవమానించ డమేనని, ఈ వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో ఎంపీలుగా ఎన్నికైన తెలంగాణకు చెందిన బీజేపీ,కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

# ప్లాస్టిక్ నిషేధంపై సర్పంచుల తీర్మానం



**ఖానాపూర్ ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక తీర్మానం చేశారు. గురువారం మండలంలోని సత్తెనపల్లి గ్రామ రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 99 రోజుల పాటు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కు సంబంధించి ఆయా శాఖల అధికారులు నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ ఆయా శాఖలు సమర్పించిన నివేదికలను కూలంకుషంగా పరిశీలించారు. ప్లాస్టిక్ నిషేధంతో పాటు ప్లాస్టిక్ వినియోగంతో జరుగుతున్న అనర్థాలను ఈ సమావేశంలో వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జీవరత్నం, తహసిల్దార్ సుజాత రెడ్డి, సిఐ అజయ్ కుమార్, ఎం పి ఓ రత్నాకర్ రావు లతోపాటు మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి అని వెళ్తే ప్రాణమే పోయింది!

- వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతి
- ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన






**అమీన్‌పూర్, ఏప్రిల్ 16(జనం సాక్షి) :** యువతి కడుపునొప్పి అని ఆసుపత్రికి వెళ్ళగా అక్కడి వైద్యులు చేసిన వైద్యం వికటించి యువతి మృతి చెందిన సంఘటన బీరంగూడ డివిజన్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన హారిక (28) బుధవారం రాత్రి కడుపునొప్పి రావడంతో పట్టణంలోనే తిరుమల ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పరిశీలించిన వైద్యులు ఆమెకు సర్జరీ చేయాలని కుటుంబ సభ్యులకు, బంధువులకు వివరించారు. సర్జరీ కోసం రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. కుటుంబ సభ్యులు సరె నని చెప్పడంతో డాక్టర్ అన్విత సర్జరీ ప్రారంభించారు. సర్జరీ ప్రారంభించిన కొద్దిసేపటికి వైద్యం వికటించి యువతి మృతి చెందింది. వైద్యులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయడంతో కుటుంబ సభ్యులు వైద్యులను నిలదీశారు. దాంతో ఆసుపత్రి యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చి బందోబస్తు ఏర్పాటు చేసుకున్నారు. యువతి మృతి చెందిందని సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు నిరసనకు దిగారు. వైద్యం వికటించడంతో యువతి ముఖం గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. కళ్ళు మొహం ఉబ్బిపోయాయి. పూర్తిగా వైద్యుల నిర్లక్ష్యంతోనే హారిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. గతంలో కూడా ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ఆస్పత్రి పై విచారణ చేసి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హారిక మృతికి కారకులైన వైద్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వైద్యం వికటించి మృతి చెందిన హారిక కుటుంబ సభ్యులకు తిరుమల ఆసుపత్రి యాజమాన్యం చర్చలు జరిపి రూ 50 లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించారు.

# సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానం

- జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికనేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ – అలైవ్కా ర్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో గల గ్రేయిన్ మార్కెట్ పరిధిలో యార్డు డ్రైవర్ లకు, అలాగే అన్ని రకాల వాహనాల డ్రైవర్ లకు కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో ఈ అరైవ్ – అలైవ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతూ, మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. జిల్లాలో రెండు నేషనల్ హైవేలు ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని, వయసు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా, సురక్షితంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే వాహనదారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు బయటకు వెళ్లిన తర్వాత సురక్షితంగా ఇంటికి చేరుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్నవారే వాహనం నడపాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని చెప్పారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలతో పాటు కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత ముఖ్యమని, ముఖ్యంగా వాహనదారులు ప్రతి 6 నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారు కచ్చితంగా కళ్లజోళ్లు ఉపయోగించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు.

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ?

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



**హైదరాబాద్, ఏప్రిల్16 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా–పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

# చెల్పూర్ కేటీపీపీలో అగ్నిప్రమాదం

**జయశంకర్ భూపాల పల్లి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** చెల్పూర్ కేటీపీపీ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్ ఆవరణలో నిల్వ ఉంచిన రిజెక్ట్ కోల్ నిల్వల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రత కారణంగా బొగ్గు నిల్వల్లో వేడి పెరిగి ఈ మంటలు అంటుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో కిలోమీటర్ల మేరకు నల్లని పొగ వ్యాపించింది, దీంతో పరిసర ప్రాంతాల ప్రజల్లో భయాందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. పరిస్థితిని కంట్రోల్‌లోకి తెచ్చేందుకు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. ఈ ఘటన కారణంగా విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

## పూరి గుడెసెల తలరాతలు మారాలనీ

బతుకంతా క్షతగాత్రుడిలా
కాలానికి ఎదురీదినవాళ్ళు
వసంత మేఘగర్జనల వెలుగులో
కల్లోల కాలానికి
కాగడాలై దారిచూపిన వాళ్ళు
నడిచివచ్చిన మహోజ్వాలచరిత్రకు
ఆనవాళ్లు వాళ్ళు

నేడు
ఆపరేషన్ కాగార్తో కాటేసి
సాంకేతిక డ్రోన్లతో జల్లెడపట్టి
రాజ్యహింసలతో అనారోగ్యాలు
ఆవరించాక,
లొంగుబాట్లు,ఎన్కౌంటర్ల మరణాల
గణాంకాలు పెరిగాయి

ఆధిపత్య అహంకారంతో
పాటలు ఉరితీయబడ్డాయి
కాలిబాటలు గాయపడ్డాయి
వీరులు నిరాశ్రయులయ్యారు.
జెండాలెత్తిన చేతులన్నీ
సొమ్మసిల్లి పడిపోయాయి

అరవై ఏళ్ళ ఆశయలు
అడవులు దాటి చౌరస్తాల్లోకి చేరి
జన జీవన స్రవంతిలోకి
స్వప్నాలై కలిసిపోతున్న వేళ

విరమించాలా? విశ్రమించాలా?
అంతర్గత ఘర్షణతో
అన్నలు అస్త్రసన్యాసం చేస్తున్నారా?
సిద్ధాంతం
యే రూపందాల్చబోతుందో!!
మేధావుల్లో వేల వేల ప్రశ్నలు

ఇది ఒక మహాత్కర్యం
తనను తాను
సరిచేసుకుంటున్న వేళ
రాబోయే తరాలకు
ఇదొక చరిత్ర అవుతుందా?
ప్రజా పోరాటాలు నిర్మించి
సాహిత్యంతో దిశా నిర్దేశం చేస్తారో...
కాలమే చెబుతుంది.


రాజకీయ వ్యూహాలు
ఎత్తుగడలతో ప్రభుత్వాలు
విజయం సాధిస్తాయేమో గానీ
బావి భారత పౌరులకి గొప్పదారులు
నిర్మించే వెలుగు సూర్యుళ్ళు
మనమధ్యే ఉదయిస్తున్నారు

సోషలిజం స్వప్న సీమ
కానే కాదు
అది ప్రతి మనిషికి
ఆకలింత సహజం
అన్నం అంత అవసరం

కాలచక్రం కదిలిపోతుంది
నిషేధాలూ, నిర్బంధాలు లేవు
బతుకుపోరాటమే మిగిలింది
మట్టిలో ఇంకిన త్యాగాలతో
పిడికిళ్ళు మొలకలై
తల ఎత్తుకుంటున్నాయి
తురాయిపూల రుధిర వర్ణం
అడవంతా అలుముకుంటుంది

**అనిత కృష్ణ.జి**

# ఎంపీలు పెరిగినా ప్రజలకు ప్రయోజనం శూన్యం!



ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న ఈ రాజకీయ నిర్మాణం, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడంలో విఫలమైతే, అది ఎంత విస్తరించినా, ఎంత సీట్లు పెరిగినా, ఎంత పెద్ద సభగా మారినా ప్రయోజనం శూన్యంగానే మిగిలిపోతుంది. 543 ఎంపీలతోనే ప్రజలకు స్పష్టమైన లాభం కనబడని పరిస్థితిలో 850కి పెంపు చేయడం ఒక నిర్మాణాత్మక విస్తరణ మాత్రమే కాని, సామాజిక మార్పుకు హామీ కాదు అనే విషయం నిర్ధారితమవుతోంది.

ప్రజల దృష్టిలో అభివృద్ధి అనేది సభల పరిమాణంలో కాదు, వారి రోజువారీ జీవితాల్లో కనిపించే మార్పులో ఉంటుంది. ఒక గ్రామంలో తాగునీరు అందుబాటులోకి రావడం, ఒక పల్లెలో రహదారి నిర్మాణం పూర్తవడం, ఒక కుటుంబానికి ఉపాధి లభించడం, ఒక విద్యార్థికి విద్యా అవకాశాలు పెరగడం – ఇవే అసలు ప్రజాస్వామ్య ఫలితాలు. కానీ ఈ ఫలితాలు కనిపించకుండా కేవలం ప్రతినిధుల సంఖ్య పెరగడం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రత్యక్ష ప్రయోజనం కలగదు. అందువల్ల ఎంపీల గెలుపు ఒక రాజకీయ విజయంగా మాత్రమే మిగిలిపోతుంది గానీ, సామాజిక అభివృద్ధికి దారి తీసే శక్తిగా మారదు.

ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన ప్రశ్న నిలుస్తుంది: ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు నిజంగా ప్రజల కోసం పనిచేస్తున్నారా? లేక ఎన్నికల రాజకీయాలకే పరిమితమవుతు న్నారా? అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న వాస్తవం రెండోది వైపే ఎక్కువగా ఉందని సూచి స్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలతో మమేకమై, తరువాత వారిని మరచిపోయే విధా నం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోంది. ఈ పరిస్థితి మారకపోతే, ఎంత పెద్ద మార్పులు తీసుకువచ్చినా అవి కేవలం పత్రాలపైనే మిగిలిపోతాయి.

సంఖ్య పెంపు అనే ఆలోచనలో ఒక ప్రమాదకరమైన సరళీకరణ ఉంది. ఎక్కువ మంది ప్రతినిధులు ఉంటే ఎక్కువ ప్రయోజనం వస్తుందని భావించడం వాస్తవానికి సరిపోదు. బాధ్యత లేని ఒక ప్రతినిధి ప్రజలకు ఉపయోగం లేకపోవడమే కాకుండా, ప్రజాధనంపై భారం అవుతాడు. అలాంటి ప్రతినిధులు పెరిగితే, వ్యవస్థపై భారమే పెరుగుతుంది. ఈ కోణంలో చూస్తే సీట్ల పెంపు ప్రజలపై ఆర్థికంగా కూడా ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. జీతాలు, సౌకర్యాలు, పరిపాలనా ఖర్చులు అన్నీ కలిపి భారీ వ్యయంగా మారతాయి. ఈ వ్యయం చివరకు ప్రజలే భరించాల్సి వస్తుంది. ఇంకా ఒక కోణంలో చూస్తే, ప్రజా స్వామ్యం యొక్క అసలు బలం సంఖ్యలో కాదు, బాధ్యతలో ఉంటుంది. బాధ్యత గల నాయకత్వం లేకుండా ప్రజాస్వామ్యం ఒక రూపకల్పన మాత్రమే. ఆ రూపకల్పనలో మార్పులు చేస్తూ ఉండటం ద్వారా మూల సమస్యలు పరిష్కారమవ్వవు. అవసరమైనది వ్యవస్థలో నైతికతను పెంపొందించడం, పారదర్శకతను స్థిరపరచడం, ప్రజల పట్ల కట్టుబాటును బలపరచడం. ఈ మూడు అంశాలు లేకపోతే ఎన్ని సీట్లు ఉన్నా ప్రజలకు ఉపయోగం కనిపించదు. ప్రజల పాత్ర కూడా ఇక్కడ కీలకం. ఓటు వేయడం మాత్రమే కాకుండా, ఎన్నికైన ప్రతినిధులను ప్రశ్నించడం, వారి పనితీరును పరిశీలించడం, బాధ్యతను గుర్తుచేయడం ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. ఈ చైతన్యం పెరిగితేనే నాయకుల్లో మార్పు వస్తుంది. లేకపోతే రాజకీయ వ్యవస్థ తనదైన దారిలో సాగుతూ ప్రజల ఆశలను పక్కన పెట్టే ప్రమాదం ఉంటుంది.

మొత్తం మీద ఈ చర్చ ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తుంది. ఎంపీలు గెలవడం సమాజానికి ఉపయోగకరమవ్వాలంటే, ఆ గెలుపు వెనుక ఉన్న బాధ్యత జీవంతో నిండి ఉండాలి. ఆ బాధ్యత లేకపోతే అది కేవలం అధికార సాధనంగా మిగిలిపోతుంది. అందు వల్ల అవసరమైనది సీట్ల పెంపు కాదు, వ్యవస్థలో మార్పు. సంఖ్య పెరిగితే ప్రజాస్వామ్యం బలపడుతుందనే భావన కంటే, నాణ్యత పెరిగితేనే నిజమైన మార్పు వస్తుందనే అవగాహన అవసరం. చివరగా చెప్పాలంటే, ఎంపీలు ఎంత మంది ఉన్నారన్నది కాదు, వారు ఎంత పనిచేస్తున్నారన్నదే అసలు ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం సానుకూలంగా మారకపోతే, డీలిమిటేషన్ వంటి మార్పులు ఎంత పెద్దగా ఉన్నా ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకురావలేవు. ప్రజాస్వామ్యం సంఖ్యల ఆటగా మిగిలిపోకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మార్చే శక్తిగా మారాలంటే, నిర్మాణాత్మక మార్పులకంటే విలువల మార్పు అత్యవసరం. అదే ఈ చర్చ యొక్క తుది సారాంశం.

ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్న రాజకీయ ప్రక్రియలు నిజంగా ప్రజల జీవితాలను మార్చుతున్నాయా అనే ప్రశ్నకు సమాధానం వెతికితే, అనేక కఠినమైన వాస్తవాలు మన ముందుకు వస్తాయి. ఎన్నికల సమయంలో గొప్ప హామీలు, అభివృద్ధి ఆశలు, ప్రజాసేవ నినాదాలు వినిపించినప్పటికీ, ఎన్నికలు పూర్తయ్యాక అదే ప్రజలు మరచిపోబడే పరిస్థితి దేశవ్యాప్తంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో 543 లోక్‌సభ స్థానాలను సుమారు 850కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదన ప్రజలలో ఆశ కంటే అనుమానాలనే ఎక్కువగా రేకెత్తిస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఎంపీలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురాలేకపోయినప్పుడు, మరిన్ని ఎంపీలు వస్తే సమాజానికి ఉపయోగం ఏమిటి అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.

ప్రస్తుత వ్యవస్థలోనే ఎన్నో నియోజకవర్గాలలో ఎంపీలు ఎన్నికైన తర్వాత ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. ప్రజల సమస్యలు స్థానిక స్థాయిలోనే పరిష్కారం కాని పరిస్థితి కొనసాగుతోంది. పార్లమెంట్‌లో ప్రజల తరఫున గొంతు వినిపించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో అది రాజకీయ విమర్శలకే పరిమితమవుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంలో ఎంపీల ప్రత్యక్ష పాత్ర ఎంత ఉందో పరిశీలిస్తే, స్పష్టమైన ఫలితాలు కనిపించకపోవడం వాస్తవం.

డీలిమిటేషన్ ద్వారా సీట్ల పెంపు ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలిస్తే, ఇది ఒక నిర్మాణాత్మక మార్పు మాత్రమేనని తెలుస్తుంది. జనాభా పెరిగినందున ప్రాతినిధ్యం పెరగాలనే వాదన సూత్రప్రాయంగా సమంజసమే అయినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో సమస్యలు ప్రాతినిధ్యం లోపంలో కాకుండా, బాధ్యత లోపంలో ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. ఒక ఎంపీ తన పరిధిలో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిజాయితీగా వ్యవహరిస్తే, చిన్న నియోజకవర్గమా పెద్ద నియోజకవర్గమా అన్నది అంత ప్రాధాన్యం ఉండదు. కానీ బాధ్యత లేకపోతే ఎంత మంది ఎంపీలు ఉన్నా ఫలితం మారదు. ప్రజాధనం వినియోగం దృష్ట్యా ఈ ప్రతిపాదన మరింత ఆందోళన కలిగిస్తుంది. ప్రతి ఎంపీకి సంబంధించిన జీతాలు, భత్యాలు, సిబ్బంది, కార్యాలయ నిర్వహణ, భద్రత వంటి ఖర్చులు భారీగా పెరుగుతాయి. ఇప్పటికే ఉన్న వ్యవస్థలోనే ప్రజాధనం వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో, మరిన్ని సీట్లు పెంచడం ద్వారా కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపడం సమంజసం కాదనే అభిప్రాయం బలపడుతోంది. ఈ వ్యయం ప్రజల అభివృద్ధికి మార్గం చూపుతుందా లేక పరిపాలనా భారాన్ని మాత్రమే పెంచుతుందా అన్నది ఆలోచించాల్సిన అంశం.

ఎంపీల పాత్రను పరిశీలిస్తే, అభివృద్ధి పనుల అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. కేంద్ర స్థాయిలో ఎంపీల బాధ్యతలు చట్టాల రూపకల్పన, విధాన చర్చల వరకు పరిమితమవుతున్నాయి. కానీ ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలు – తాగునీరు, రోడ్లు, విద్య, ఆరోగ్యం – ఇవి ప్రధానంగా స్థానిక పరిపాలన పరిధిలోనే పరిష్కారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ సంఖ్య పెరగడం ద్వారా ఈ సమస్యలకు ప్రత్యక్ష పరిష్కారం లభిస్తుందని చెప్పడం కష్టం.

మొత్తంగా పరిశీలిస్తే, డీలిమిటేషన్ ద్వారా సీట్ల పెంపు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే నిర్ణయంగా కనిపించడం లేదు. ఇప్పటికే ఉన్న వ్యవస్థలోనే ప్రజలకు తగిన ప్రయోజనం అందని పరిస్థితిలో, మరిన్ని ఎంపీలు రావడం ద్వారా మార్పు వస్తుందని భావించడం వాస్తవానికి దూరంగా ఉంటుంది. ప్రజల అభివృద్ధికి అవసరమైనది సంఖ్య పెంపు కాదు; బాధ్యత గల నాయకత్వం, సమర్థవంతమైన పాలన, ప్రజల పట్ల నిజమైన కట్టుబాటు. ఈ అంశాలు బలపడితేనే ప్రజాస్వామ్యం సార్థకం అవుతుంది. లేకపోతే ఎంపీలు గెలవడం ఒక రాజకీయ ప్రక్రియగానే మిగిలిపోతుంది గానీ, సమాజానికి ప్రయోజనం చేకూర్చే సాధనంగా మారదు.

2.డీలిమిటేషన్ ద్వారా ఎంపీ సీట్ల పెంపు చర్చ చివరికి ఒక ముఖ్యమైన మూల ప్రశ్న దగ్గరికి తీసుకువస్తుంది: ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల జీవితాలను మెరుగుపరుస్తుందా లేక కేవలం రాజకీయ వ్యవస్థను విస్తరించడానికే పరిమితమవుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నంలో మనం వ్యవస్థ యొక్క అంతరంగాన్ని గమనించాల్సి ఉంటుంది. ఎన్నికలు, ప్రతినిధులు, సభలు ఇవన్నీ ప్రజాస్వామ్యానికి బాహ్య రూపాలు మాత్రమే. కానీ ఆ రూపాల వెనుక ఉన్న విలువలు, నిబద్ధత, బాధ్యతలే అసలు ప్రజాస్వామ్యాన్ని నిర్వచిస్తాయి.

ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితుల్లో ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకున్న ప్రతినిధుల నుంచి ఆశించిన ఫలితాలను పొందలేకపోతున్నారు. ఎన్నో ప్రాంతాల్లో ప్రజల ప్రాథమిక అవసరాలు ఇంకా నెరవేరని వాస్తవం కొనసాగుతోంది. తాగునీరు, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారంలో ఎంపీల పాత్ర ఎంత ఉందో పరిశీలిస్తే, చాలా సందర్భాల్లో అది పరిమితంగానే కనిపిస్తుంది. ఈ పరిస్థితిలో ఎంపీల సంఖ్యను పెంచడం ద్వారా ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయని భావించడం ఒక మాయాభ్రాంతి మాత్రమే.

ప్రజాస్వామ్యంలో ప్రతినిధిత్వం అనేది కేవలం స్థానాల సంఖ్యతో కొలవబడదు. అది ప్రజలతో ఉన్న అనుబంధం, సమస్యల పట్ల ఉన్న స్పందన, పరిష్కారాల పట్ల ఉన్న కట్టుబాటు ఆధారంగా నిర్ణయించబడుతుంది. ఒక ఎంపీ తన నియోజకవర్గంలో ప్రజలతో నిరంతరం మమేకమై ఉంటే, వారి సమస్యలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తే, ఆ ప్రాంతంలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. కానీ అదే బాధ్యత లేకుండా వ్యవహరిస్తే, ఎంత పెద్ద నియోజకవర్గం అయినా, ఎంత మంది ప్రతినిధులు ఉన్నా, ప్రజలకు ఉపయోగం పరిమితంగానే ఉంటుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం ప్రజాధనం వినియోగం. ప్రజలు చెల్లించే పన్నుల రూపంలో సమకూరే ఈ ధనం అత్యంత బాధ్యతతో వినియోగించాల్సిన అవసరం ఉంది. కానీ సీట్ల పెంపు ద్వారా పరిపాలనా వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ వ్యయం ప్రత్యక్షంగా ప్రజల అభివృద్ధికి దోహదపడుతుందా లేక పరిపాలనా వ్యవస్థను కొనసాగించడానికే ఖర్చవుతుందా అన్నది విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఉన్న వ్యవస్థలోనే ప్రజాధనం వినియోగంపై విమర్శలు ఉన్నప్పుడు, మరింత విస్తరణ సమంజసం కాదనే అభిప్రాయం బలపడుతోంది.

మొత్తంగా పరిశీలిస్తే, డీలిమిటేషన్ ద్వారా ఎంపీ సీట్ల పెంపు ఒక నిర్మాణాత్మక చర్య మాత్రమే. అది స్వతంత్రంగా ప్రజల అభివృద్ధికి దారి తీస్తుందని అనుకోవడం వాస్తవానికి దూరంగా ఉంటుంది. ప్రజాస్వామ్య సారాంశం సంఖ్యలో కాదు, నాణ్యతలో ఉంటుంది. బాధ్యత గల నాయకత్వం, పారదర్శక పాలన, ప్రజల పట్ల నిబద్ధత -- ఇవే అసలు మార్పును తీసుకువచ్చే శక్తులు. ఈ అంశాలు బలపడితేనే ప్రజలకు నిజమైన ప్రయోజనం కలుగుతుంది. అంతిమంగా చెప్పాలంటే, ఎంపీలు గెలవడం ఒక రాజకీయ ప్రక్రియ మాత్రమే. అది సమాజానికి ప్రయోజనం చేకూర్చాలంటే, ఆ ప్రతినిధులు తమ బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించాలి. లేకపోతే సీట్ల సంఖ్య ఎంత పెరిగినా, ప్రజల జీవితాల్లో మార్పు కనిపించదు. అందువల్ల అవసరమైనది సంఖ్య పెంపు కాదు, వ్యవస్థలో గుణాత్మక మార్పు. అదే ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేసే మార్గం.

చివరికి ఈ మొత్తం చర్చ ఒక అసలు సత్యాన్ని స్పష్టంగా బయటపెడుతుంది. ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగుతున్న ఈ రాజకీయ నిర్మాణం, ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడంలో విఫలమైతే, అది ఎంత విస్తరించినా, ఎంత సీట్లు పెరిగినా, ఎంత పెద్ద సభగా మారినా ప్రయోజనం శూన్యంగానే మిగిలిపోతుంది. 543 ఎంపీలతోనే ప్రజలకు స్పష్టమైన లాభం కనబడని పరిస్థితిలో 850కి పెంపు చేయడం ఒక నిర్మాణాత్మక విస్తరణ మాత్రమే కాని, సామాజిక మార్పుకు హామీ కాదు అనే విషయం నిర్ధారితమవుతోంది. ప్రజల పాత్ర కూడా ఇక్కడ కీలకం. ఓటు వేయడం మాత్రమే కాకుండా, ఎన్నికైన ప్రతినిధులను ప్రశ్నించడం, వారి పనితీరును పరిశీలించడం, బాధ్యతను గుర్తుచేయడం ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయి. ఈ చైతన్యం పెరిగితేనే నాయకుల్లో మార్పు వస్తుంది. లేకపోతే రాజకీయ వ్యవస్థ తనదైన దారిలో సాగుతూ ప్రజల ఆశలను పక్కన పెట్టే ప్రమాదం ఉంటుంది.

మొత్తం మీద ఈ చర్చ ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తుంది. ఎంపీలు గెలవడం సమాజానికి ఉపయోగకరమవ్వాలంటే, ఆ గెలుపు వెనుక ఉన్న బాధ్యత జీవంతో నిండి ఉండాలి. ఆ బాధ్యత లేకపోతే అది కేవలం అధికార సాధనంగా మిగిలిపోతుంది. అందువల్ల అవసరమైనది సీట్ల పెంపు కాదు, వ్యవస్థలో మార్పు. సంఖ్య పెరిగితే ప్రజాస్వామ్యం బలపడుతుందనే భావన కంటే, నాణ్యత పెరిగితేనే నిజమైన మార్పు వస్తుందనే అవగాహన అవసరం.చివరగా చెప్పాలంటే, ఎంపీలు ఎంత మంది ఉన్నారన్నది కాదు, వారు ఎంత పనిచేస్తున్నారన్నదే అసలు ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం సానుకూలంగా మారకపోతే, డీలిమిటేషన్ వంటి మార్పులు ఎంత పెద్దగా ఉన్నా ప్రజల జీవితాల్లో వెలుగును తీసుకురావలేవు. ప్రజాస్వామ్యం సంఖ్యల ఆటగా మిగిలిపోకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మార్చే శక్తిగా మారాలంటే, నిర్మాణాత్మక మార్పులకంటే విలువల మార్పు అత్యవసరం. అదే ఈ చర్చ యొక్క తుది సారాంశం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# నవ్వుల వెనుక కన్నీళ్ల సాక్షి

**“శతాబ్దపు నిశ్శబ్ద గళం - మానవత్వపు మహాకావ్యం “చార్లీ చాప్లిన్”**



మానవ చరిత్రలో యుద్ధాలు జరిగినప్పుడు ఆయుధాలు శబ్దం చేశాయి. కానీ, ఒక మౌన యోధుడు మాత్రం కేవలం తన సైగలతో, నవ్వుతో ప్రపం చాధిపత్య కాంక్షను, నియంతృత్వాన్ని గడగడలాడించాడు. ఆయనే చార్లీ చాప్లిన్. ఏప్రిల్ 16న ఆయన పుట్టినరోజు. ప్రపంచం దుఃఖంలో ఉన్నప్పుడు నవ్వించడం ఒక ఎత్తైతే, ఆ నవ్వు ద్వారా ఆలోచింపజేయడం చాప్లిన్ ప్రత్యేకత. ఒక నల్లని టోపీ, చేతిలో కర్ర, వింతైన నడక.. ఇవి కేవలం ఒక వేషధారణకు సంబంధించిన గుర్తులు కావు. అవి ఒక నిరుపేద ఆర్తికి, ఒక సామాన్యుడి ధిక్కారానికి చిహ్నాలు. శతాబ్దపు నిశ్శబ్ద గళం చార్లీ చాప్లిన్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నవ్వుల వెనుక దాగిన సామాజిక సత్యాలను ఎంతోకొంత తరిమిచూడాల్సిన అవసరం ఉంది”.

చాప్లిన్ జీవితం ఒక తెరిచిన పుస్తకం, కానీ అది కన్నీళ్లతో తడిసిన పుటలు కలిగినది. లండన్‌లోని మురికివాడల్లో కటిక పేదరికం, మానసిక స్థితి సరిగా లేని తల్లి, ఇవన్నీ ఆయనను కుంగదీయలేదు. బదులుగా, సమాజంలోని అట్టడుగు వర్గాల కష్టాలను అర్థం చేసుకునేలా చేశాయి. ఆయన సృష్టించిన ‘ది ట్రాంప్’ పాత్ర కేవలం ఒక బఫూన్ కాదు. అది ఆకలికి, ఆశకు, ఆత్మాభిమానానికి నిలువుటద్దం. చాప్లిన్ సృష్టించిన “ ది ట్రాంప్’ పాత్రలో ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. అతను కోటు వేసుకుంటాడు కానీ అది చిరిగిపోయి ఉంటుంది. చేతిలో కర్ర పట్టుకుంటాడు. అది ఒక హోదాకు సంకేతం, కానీ అతను ఒక యాచకుడు. సమాజం ఎంతగా తృణీకరించినా, తన ఆత్మాభిమానాన్ని వదులుకోని ఒక మధ్యతరగతి లేదా పేదవాడి మనస్తత్వానికి ఆ పాత్ర ప్రతిబింబం. నడకలో తడబాటు ఉన్నా, మనసులో దృఢత్వం కలిగిన ఈ పాత్ర ద్వారా, “గౌరవం అనేది ధనంలో లేదు, వ్యక్తిత్వంలో ఉంది” అని చాప్లిన్ నిరూపించారు.

చాప్లిన్ కేవలం హాస్యనటుడు మాత్రమే కాదు, గొప్ప రాజకీయ విమర్శకుడు కూడా. ది గ్రేట్ డిక్టేటర్ తో హిట్లర్ రాక్షస పాలనను ఎండగడుతూ ఆయన తీసిన ఈ చిత్రం అప్పట్లో ఒక సంచలనం. అడాల్ఫ్ హిట్లర్ ఎదుగుతున్న సమయంలో, ప్రపంచ దేశాలు మౌనంగా ఉన్నప్పుడు, చాప్లిన్ తన సొంత ఖర్చుతో ఈ సీనిమా తీశారు. హిట్లర్, చాప్లిన్ ఇద్దరూ ఒకే నెల, ఒకే ఏడాది (ఏప్రిల్ 1889) పుట్టారు. హిట్లర్ తన మీసాలను భయం పలకడానికి ఉపయోగిస్తే, చాప్లిన్ అవే మీసాలను హాస్యం ద్వారా నియంతృత్వాన్ని ఎండగట్టడానికి ఉపయోగించారు. మోడరన్ టైమ్స్ లో పారిశ్రామిక విప్లవం మనిషిని ఒక యంత్రంలా ఎలా మార్చేస్తుందో ఈ సినిమా అద్భుతంగా చూపిస్తుంది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మనిషి తన అస్తిత్వాన్ని ఎలా కోల్పోతున్నాడో చాప్లిన్ ముందే హెచ్చరించారు.

“అద్దం నా ఉత్తమ స్నేహితుడు, ఎందుకంటే నేను ఏడ్చినప్పుడు అది ఎప్పుడూ నవ్వదు”. “ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు, మన కష్టాలతో సహా”.

”నువ్వు కిందికి చూస్తూ ఉంటే, ఎప్పటికీ ఇంద్రధనస్సును చూడలేవు”. “నేను వర్షంలో నడవడానికి ఇష్టపడతాను, ఎందుకంటే నా కన్నీళ్లు ఎవరికీ కనిపించవు”. అన్న చార్లీ చాప్లిన్ మాటలు నేటి సమాజానికి సందేశంగానే చూడాలి. నేడు ద్వేషం, యుద్ధం, అసహనం రాజ్యమేలుతున్న కాలంలో చాప్లిన్ ‘మార్గం’ అత్యంత అవసరం. ఆయన మార్గం కేవలం నవ్వించడం కాదు. మనిషిని ప్రేమించడం. కన్నీళ్లను తుడుస్తూనే, అన్యాయంపై మౌనంగానే గొంతెత్తడం.


ఆయన దృష్టిలో నవ్వు అంటే కేవలం సరదా కాదు. “నిజమైన హాస్యం అనేది తీవ్రమైన బాధ నుండి పుడుతుంది” అని ఆయన నమ్మేవారు. తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న పేదరికాన్ని, తల్లి అనారోగ్యాన్ని ఆయన తెరపై హాస్యంగా మార్చారు. అంటే, సమస్యలను చూసి కుంగిపోవడం కంటే, వాటిని చూసి నవ్వగలిగే శక్తిని సంపాదించుకోవడమే చాప్లిన్ మనకు చూపిన మార్గం. కమ్యూనిజం ఆరోపణలతో అమెరికా ఆయనను దేశం నుండి వెళ్లగొట్టినప్పుడు కూడా ఆయన తన సిద్ధాంతాలను వదులుకోలేదు. తన పుస్తకంలో “నేను ఏ వర్గానికీ చెందినవాడిని కాను, నేను కేవలం మానవత్వానికి మద్దతుదారుడిని” అని స్పష్టం చేశారు.

టాకీ సినిమాలు (మాటలు వినిపించే సినిమాలు) వచ్చాక కూడా చాప్లిన్ చాలా కాలం మూకీ సినిమాలకే మొగ్గు చూపారు. భాష అనేది మనుషులను విడదీస్తుందని, కానీ భావం ప్రపంచవ్యాప్తంగా అందరికీ ఒకటేనని ఆయన నమ్మారు. అందుకే ఆయన సినిమాలు అమెరికా నుంచి ఆసియా లోని పల్లెల వరకు అందరికీ అర్థమయ్యాయి. మాటలు లేని చోట ఆయన కళ్ళు, చేతులు సామాజిక అన్యాయాలపై గొంతెత్తాయి. ఇది ఒక అంతర్జాతీయ భాషను సృష్టించిన గొప్ప ప్రయోగం. బ్లాక్ అండ్ వైట్ తెరపై రంగుల కలలను పండించిన ఆ మహానుభావుడికి నివాళి అర్పించడమంటే.. మన చుట్టూ ఉన్న వారి కళ్లల్లో ఆనందాన్ని నింపడమే. చార్లీ చాప్లిన్ భౌతికంగా లేకపోయినా, ఒక సామాన్యుడు వ్యవస్థను ప్రశ్నించిన ప్రతిసారీ ‘ ది ట్రాంప్’ రూపంలో ఆయన జీవించే ఉంటారు. నేటి ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యాంత్రిక జీవనం వైపు వేగంగా వెళ్తోంది. సరిగ్గా వందేళ్ల క్రితమే చాప్లిన్ ‘మోడరన్ టైమ్స్’ ద్వారా హెచ్చరించారు “మనుషులు యంత్రాలు కాకూడదు. “ఏప్రిల్ 16న మనం చాప్లిన్‌ను గుర్తుచేసుకోవడమంటే.. మనలోని మనిషిని, సాటి మనిషి పట్ల ఉండే కరుణను గుర్తుచేసుకోవడమే. ఆయన చిరునవ్వు వెనుక ఉన్న కన్నీటిని అర్థం చేసుకున్నప్పుడే, ఆయన కళకు మనం ఇచ్చే అసలైన గౌరవం.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# డీలిమిటేషన్ వివాదం: సమాన ప్రతినిధిత్వమా? ప్రాంతీయ అన్యాయమా?



భారత రాజ్యాంగ వ్యవస్థలో “డీలిమిటేషన్” అనేది సాధారణ పరిపాలనా ప్రక్రియ కాదు; ఇది ప్రజాస్వామ్యానికి మూల సూత్రమైన “ఒక ఓటు, ఒక విలువ” అనే సిద్ధాంతాన్ని అమలు చేసే కీలక సాధనం. ప్రతి జనగణన తర్వాత జనాభా మార్పులను ప్రతిబింబించేలా పార్లమెంట్ స్థానాల సంఖ్యను, సరిహద్దులను పునర్వ్యవస్థీకరించడం దీని లక్ష్యం. కానీ 1976 నుండి 2026 వరకు ఈ ప్రక్రియను నిలిపివేయడం వల్ల, ఇప్పుడు ఇది కేవలం సాంకేతిక చర్యగా కాకుండా, రాజకీయంగా అత్యంత వివాదాస్పద అంశంగా మారింది. ఈ నేపథ్యంలో “డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తుంది” అనే వాదన ఎంతవరకు నిజం? కేంద్ర ప్రభుత్వ వాదన ఎంతవరకు సమంజసం? ఈ ప్రశ్నలకు సమగ్ర సమాధానం అవసరం.

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలు – నిజమైన కారణాలున్నాయా?

దక్షిణాది రాష్ట్రాల ప్రధాన వాదన ఏమిటంటే – జనాభా ఆధారంగా స్థానాల పునర్విభజన జరిగితే, వారు రాజకీయంగా బలహీనపడతారు. కారణం స్పష్టంగా ఉంది: దక్షిణ రాష్ట్రాలు కుటుంబ నియంత్రణలో ముందంజలో ఉన్నాయి. ఉత్తర రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితిలో, జనాభా ఆధారంగా సీట్లు కేటాయిస్తే ఉత్తర రాష్ట్రాలకు అధిక ప్రతినిధిత్వం లభిస్తుం ది. ఉదాహరణకు, అంచనాల ప్రకారం: ఉత్తరప్రదేశ్ సీట్లు 80 నుండి 128కు పెరగవచ్చు.బీహార్ 40 నుండి 70కు పెరగవచ్చు.కానీ, కేరళలో సీట్లు తగ్గే అవకాశం ఉంది. ఇది కేవలం సంఖ్యల మార్పు కాదు. ఇది కేంద్రంలో విధాన నిర్ణయాలపై ప్రభావం చూపుతుంది. దక్షిణ రాష్ట్రాలు చెబుతున్నట్లు, ఇది “పాలసీ విజయానికి శిక్ష” లాంటిదే. జనాభా నియంత్రణ లో విజయవంతమైన రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయి. తాజా వార్తల ప్రకారం, తమిళనాడు వంటి రాష్ట్రాల ప్రాతినిధ్యం శాతం 7 శాతం నుండి 5 శాతానికి పడిపోవచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అందువల్ల, దక్షిణాది వాదన పూర్తిగా భావోద్వేగపూరితం కాదు. దీనికి గట్టి గణాంక, విధాన పరమైన ఆధారాలు ఉన్నాయి.

### కేంద్ర ప్రభుత్వం వాదన - ప్రజాస్వామ్య సమానత్వమా?

కేంద్ర ప్రభుత్వ దృష్టిలో, డీలిమిటేషన్ అనేది రాజ్యాంగపరమైన బాధ్యత. ప్రతి ఎంపీకి సమాన జనాభా ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రాల మధ్య భారీ అసమానతలు ఉన్నాయి. ఉదాహరణకు: బీహార్‌లో ఒక ఎంపీకి సుమారు 31 లక్షల మంది.కేరళలో అదే సంఖ్య 17.5 లక్షలు. ఇది “ఒక ఓటు – ఒక విలువ” అనే సూత్రానికి వ్యతిరేకం. కాబట్టి, జనాభా ఆధారంగా సీట్లు పెంచడం తప్పనిసరి అని కేంద్రం చెబుతోంది. అదే సమయంలో, కేంద్రం ఇటీవల చెప్పిన మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే -2011 జనగణన ఆధారంగా మాత్రమే డీలిమిటేషన్ జరగదు.మొత్తం సీట్లు పెంచి సమతుల్యం తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతుంది. అంటే, కేంద్రం వాదనలో కూడా ఒక న్యాయబద్ధత ఉంది. ఇది ప్రజాస్వామ్య సమానత్వం కోసం అవసరమని వారు చెబుతున్నారు.

### ఇది నిజంగా “ఉత్తరం ఐం దక్షిణం” సమస్యేనా?

ఈ వివాదాన్ని పూర్తిగా ప్రాంతీయ కోణంలో చూడడం సరైనది కాదు. ఇది మూడు ప్రధాన సూత్రాల మధ్య సంఘర్షణ:ప్రజాస్వామ్య సమానత్వం (పాపులేషన్-బేస్డ్ రిప్రసెంటేషన్), ఫెడరల్ సమతుల్యం (ఫెడరల్ బ్యాలెన్స్), పాలసీ ప్రోత్సాహం (రికార్డింగ్ గుడ్ గవర్నెన్స్) ఇప్పుడు డీలిమిటేషన్ ఒక సూత్రాన్ని బలపరుస్తే, మరోదాన్ని బలహీనపరచే ప్రమాదం ఉంది. అందుకే ఈ సమస్య క్లిష్టమైంది.

### లోపాలు - ప్రస్తుత విధానంలో సమస్యలు

ప్రస్తుతం ప్రతిపాదిత విధానంలో కొన్ని ప్రధాన లోపాలు ఉన్నాయి:

**1. జనాభా ఆధారిత మోడల్ అసమతుల్యం:** జనాభా మాత్రమే ప్రమాణంగా తీసుకుంటే, అభివృద్ధి, పన్నుఆదాయం,సామాజిక సూచికలు లెక్కలోకి రావు.

**2. ఫెడరల్ అసమతుల్యం ప్రమాదం:**
ఉత్తర రాష్ట్రాలు అధిక సీట్లు పొందితే, కేంద్రంలో వారి ఆధిపత్యం పెరుగుతుంది. ఇది విధానాలలో ప్రాంతీయ అసమానతలకు దారితీయవచ్చు.

**3. రాజకీయ ప్రభావం:**
కొన్ని రాజకీయ పార్టీలు ప్రాంతీయ అసమానతల వల్ల లాభ పడే అవకాశం ఉంది ఇది అనుమానాలను పెంచుతోంది. 4. ఆలస్యమైన జనగణన సమస్య: 2027 జనగణన ఆలస్యం వల్ల డీలిమిటేషన్ అమలు, ఎన్నికల సమయాలపై అనిశ్చితి ఉంది.

పరిష్కార మార్గాలు – సమతుల్య దారి ఏది?

ఈ సమస్యకు సమగ్ర పరిష్కారం అవసరం. కొన్ని ముఖ్యమైన సూచనలు:

1. **“హైబ్రిడ్ ఫార్ములా” అవసరం:** జనాభాతో పాటు: అభివృద్ధి సూచికలు, పన్ను ఆదాయం లెక్క లోకి తీసుకోవాలి. జనాభా నియంత్రణ పనితీరు... వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
2. **సీట్ల సంఖ్య పెంపు:** ప్రస్తుత సీట్లు తగ్గించకుండా, మొత్తం సీట్లను పెంచడం ద్వారా సమతుల్యం సాధించవచ్చు.
3. **రాజ్యసభ బలోపేతం:** రాజ్యసభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధిత్వం పెంచితే, ఫెడరల్ సమతుల్యం కాపాడవచ్చు.
4. **ట్రాన్సిషన్ మెకానిజం:** ఒకేసారి భారీ మార్పులకంటే, దశల వారీగా అమలు చేయాలి.
5. **రాజకీయ ఏకాభిప్రాయం:** ఈ నిర్ణయం ఒక పార్టీ ఆధారంగా కాకుండా, అన్ని రాష్ట్రాల మధ్య చర్చతో తీసుకోవాలి.

### తీర్పు - ఎవరి వాదన బలమైనది?

సహేతుకంగా చూస్తే: కేంద్రం వాదన: రాజ్యాంగపరంగా, ప్రజాస్వామ్య పరంగా సరైనది.దక్షిణ రాష్ట్రాల వాదన: ఫెడరల్ న్యాయం, సమాన అభివృద్ధి దృష్టిలో బలమైనది.అంటే, రెండు వాదనలలోనూ నిజం ఉంది. కానీ ఒక విషయం స్పష్టంగా చెప్పాలి: కేవలం జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే, అది దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం చేసే అవకాశాలు ఎక్కువ.అదే సమయంలో, డీలిమిటేషన్ పూర్తిగా నిలిపివేయడం కూడా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. డీలిమిటేషన్ సమస్య “ఎవరి వాదన సరైందో” అన్నది కాదు; “ఎలా సమతుల్యం సాధించాలి” అన్నది ముఖ్యమైన అంశంగా ఉండాలి. భారతదేశం ఒక ఫెడరల్ దేశం – కేవలం జనాభా ప్రాతిపదిక కాదు. ప్రాంతీయ సమతుల్యం కూడా అంతే ముఖ్యం. కాబట్టి, ఉత్తర రాష్ట్రాలకు న్యాయం చేస్తూ, దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండే మధ్య మార్గమే సరైనది. “జనాభా అభివృద్ధి ఫెడరల్ సమతుల్యం” ఆధారంగా ఉండే సమగ్ర డీలిమిటే షన్ విధానం. ఇది అమలు చేస్తేనే భారత ప్రజా స్వామ్యం బలపడుతుంది. లేకపోతే ప్రాంతీయ విభజనలు మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమాలు

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో ప్రజలకు అవగాహన
- హెచ్‌పివి వ్యాక్సిన్ తో సర్వైకల్ క్యాన్సర్ నివారణ
- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు
- ఎర్రవల్లి మండల స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్



**ఎర్రవల్లి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలతో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 10 ముఖ్యాంశాలను అజెండాగా తీసుకొని 99 రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం జరిగిందని, గ్రామసభలు కూడా పూర్తి చేశామన్నారు. మండల స్థాయి సమావేశాల అనంతరం నియోజకవర్గ స్థాయిలోనూ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హెచ్ పివి వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించవచ్చని 14 ఏళ్ల అమ్మాయిల అందరికీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు రాని వారికి తర్వాత విడతలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పోషణ్ పక్వాడలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల చిన్నారులు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నందున వినియోగించుకోవాలన్నారు. సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తుంటే అక్కడి పని తీరు మెరుగుపడుతుందన్నారు. అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు తమ ప్రాంత సమస్యలను గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎర్రవల్లి మండల ప్రత్యేక అధికారి సుషిత, తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో మహేష్, సర్పంచ్ అనిత, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత అందరి బాధ్యత



**శంషాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆర్‌టీసీ బస్ స్టాండ్ వద్ద గురువారం "సేఫ్ గాడీ " కార్యక్రమం ఏసీపీ నాగభూషణం, ఎస్‌హెచ్‌ఓ బి. ప్రమోద్ కుమార్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న సుమారు 600 కమర్షియల్ క్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ స్టిక్కర్లు పంపిణీ చేశారు. 2019 నుంచి హైదరాబాద్‌లో అమలులో ఉన్న ఈ కార్యక్రమం మోటార్ వెహికిల్స్ యాక్ట్, 1988 నిబంధనలకు అనుగుణంగా రూపొందించబడింది. క్యాబ్‌లకు క్యూఆర్ కోడ్ఙమ్మమ మేము మ్మ ఆధారిత గుర్తింపు, డ్రైవర్ ట్రేసబిలిటీ, ప్రయాణికుల ఫిర్యాదు వ్యవస్థ వంటి సౌకర్యాలు కల్పించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు రాత్రి ప్రయాణికుల్లో భద్రతపై విశ్వాసం పెరుగుతుందని, గుర్తింపులేని క్యాబ్‌ల ప్రమాదం తగ్గుతుందని అధికారులు తెలిపారు. ప్రజా రవాణాలో బాధ్యతాయుత వ్యవహారం పెరిగి, వ్యవస్థపై నమ్మకం బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ అధికారులు క్యాబ్ డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రహదారి భద్రత సాధ్యమని ఏసీపీ నాగభూషణం పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న అలైవ్ అలైవ్ ప్రచారంలో భాగంగా గురువారం 4వ రోజు శంషాబాద్‌లో క్యాబ్, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిఫాం ధరించడం, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్, రియర్ వ్యూ మిర్రర్ వినియోగం, పాసెంజర్ ఓవర్లోడింగ్ నివారణ వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. అలాగే శంషాబాద్‌లోని "షాలిని కంటి ఆస్పత్రి"లో డా. షాలిని, డా. మౌక్తిక ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి. ప్రమోద్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి లేని నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి



**తాండూరు, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** అనుమతి లేని నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ కౌన్సిలర్ లు పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలరలు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సర్వే నంబర్ 130లో ఉన్న సుమారు 36 గుంటల ప్రభుత్వ భూమిపై జరుగుతున్న తీవ్రమైన అక్రమాలను మీ దృష్టికి అత్యవసరంగా తీసుకువస్తున్నామని వివరించారు. సదరు భూమి పూర్తిగా ప్రభుత్వానికి చెందినదని స్పష్టమైన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. ఆ ఆధారాలన్నింటిని ఈ ఫిర్యాదుతో పాటు మీ కార్యాలయానికి సమర్పిస్తున్నాను. అయినప్పటికీ, చట్టాన్ని పట్టించుకోకుండా, ఆ ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు ముఖ్యంగా, దాదాపు 300 గజాల విస్తీర్ణంలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని షట్టర్లు నిర్మించడం జరుగుతోంది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమైన చర్య మాత్రమే కాకుండా, మున్సిపల్ పరిపాలనకు బహిరంగ సవాల్ గా మారింది. అదే ప్రదేశంలో మరొక అక్రమ భవనం కూడా నిర్మాణంలో ఉంది. ఈ మొత్తం వ్యవహారం. మున్సిపల్ కార్యాలయం ఎదుటే జరుగుతుండటం అత్యంత విచారకరం. మున్సిపల్ వ్యవస్థ ప్రతిష్టకు తీవ్ర అవమానకరం. సర్వే నంబర్ 130లోని మొత్తం 36 గుంటల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి సీజ్ చేయాలి. ఇప్పటికే నిర్మించిన షట్టర్లను చట్ట ప్రకారం కూల్చివేయాలి. ఆక్రమంగా నిర్వాణం చేపడుతున్న వ్యక్తి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ దీపనర్సింలు, కౌన్సిలర్లు ఈర్షాద్, జావిద్, సురేష్ నాయక్, యోగానంద్, నవీన సంతోష్ గౌడ్, రూప రుద్రుపాటిల్, ఉమా

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి



**మోమిన్‌పేట్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి ఉంటుందని తెలంగాణ శాసన సభాధిపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మోమినిపేట మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన అబ్దుల్ సమద్ పదవి విరమణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో ఎక్కడ పని చేసిన అంకితభావంతో పనిచేసి ఆయా విద్యార్థులు తల్లిదండ్రుల మన్ననలు, పొందారన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో సమాజం ఉపయోగపడే విధంగా బావి భారత పౌరులను తయారుచేసే ఘనత ఉపాధ్యాయ వృత్తికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బహదూర్పుర ఎంఐఎం ఎమ్మెల్యే ముబిన్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రెడ్డి, సిద్దిపేట పీఠాధిపతి, హజ్రత్ షరీఫ్ తెలంగాణ టి జి పి ఎస్ సి మెంబర్, సి, విట్టల్ జిల్లా విద్యాధికారి, రేణుకా దేవి, జెడ్పి మాజీవైస్ చైర్మన్ బి విజయ్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిఎంఎస్ మాజీ చైర్మన్, నరసింహులు గుప్త జిల్లా కాంగ్రెస్, పార్టీ నాయకులు, ఎం నరోత్తం రెడ్డి, టి టి యు, రాష్ట్ర అధ్యక్షులు, మనీ పాల్ రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ, మండల విద్యాధికారి నర్సింలు, మేక వనంపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గౌరీ శంకర్, మోమిన్ పేట సర్పంచ్ గౌడ్, అమ్రాదికుర్ద్ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కోస్గి,సురేందర్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయా గ్రామాల సర్పంచులు మీద పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

- మార్కెట్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి

**జోగిపేట, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అమలు అయ్యేలా చూడాలని జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి అన్నారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అందోల్ మండలంలోని సంగుపేట రైతు వేదికలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన మాట్లాడుతూ అర్హులకు ఏ ఇబ్బంది లేకుండా పథకాలు అమలు అయ్యేలా చూడాలని తెలిపారు. ముఖ్యంగా రైతులకు క్షేత్రస్థాయిలో అన్ని విధాలా ఆదుకోవాలని తెలిపారు. అలాగే పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి పథకాలను ప్రత్యేక అధికారి రమాదేవి ఎంపీడీవో రాజేష్ కుమార్ లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు.

## రోడ్డుకి ఇరువైపులా అక్రమ నిర్మాణాలను సహించేది లేదు

- దుండిగల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్



**నిజాంపేట్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** దుండిగల్ సర్కిల్ పరిధిలో గండిమైసమ్మ చౌరస్తా నుండి మియాపూర్ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ ఆక్రమించుకొని నిర్మించిన అక్రమ నిర్మాణాలను గురువారం దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు సుమారుగా 37 నిర్మాణాలను తొలగించడం జరిగింది, ఇంకనూ ఉన్న ఆక్రమిత నిర్మాణాలను ప్రతిరోజు గుర్తించి తొలగించడం జరుగుతుంది, ఈ కార్యక్రమంలో, డిప్యూటీ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్, ఏసిపి శ్రీనివాస్ , టిపిఎస్ ముఖేష్ సింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్




**శామీర్ పేట్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట కూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం డిసిసి అధ్యక్షుడిని సన్మానించిన అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి షామీర్ పేట డివిజన్ అంతయిపల్లి లోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం రోజు జరిగిన టియుడబ్ల్యూజే రాష్ట్రస్థాయి కార్య వర్గ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ జయపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ లను మేడ్చల్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి బాలరాజు, వెంకట్రాంరెడ్డిల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా మెమెంట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టు లకు అండగా ఉంటానని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, జిల్లా ఆర్టిఏ నెంబర్ జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి,మూడు చింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, గుల్లపోచంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి పేట శ్రీనివాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ప్రగతి కోసం ప్రణాళిక రూపొందించాలి



**కృష్ణ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** గ్రామాల్లో ప్రగతి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కృష్ణ మండల ప్రత్యేక అధికారి వెంకట రమణ సూచించారు. గురువారం మండలం కెంద్ర రైతువేదిక భవనంలో ప్రజాపాలనపై మండల సభ నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక ఈ ప్రభుత్వం వచ్చినంక ప్రజా ప్రణాళికతో, అన్ని శాఖ అధికారులు,తాసిల్దార్ శ్రీనివాస, ఎంపీడీవో విజయలక్ష్మి ,సూపర్డెంట్ రామకృష్ణ,హెల్త్ డిపార్ట్మెంట్ విద్యాధికారి నిజముద్దీన్ యాదగిరి పోలీస్, తదితర శాఖల అధికారులు హాజరయ్యారు ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు.

# నోయిడా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**నిజాంపేట్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సిఐటియు బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నోయిడా కార్మికుల సమస్యలపై మద్దతు తెలుపుతూ గురువారం ప్రగతి నగర్ అడ్డా కార్మికులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్ మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పోరాటాలను ఉత్తరప్రదేశ్, హర్యానాలోని బీజేపీ ప్రభుత్వాలు క్రూరంగా అణచివేయడాన్ని తీవ్రంగా ఖండించింది. నోయిడా ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు రోజుకు పది నుంచి 13 గంటలు పనిచేస్తే నెలకు కేవలం రూ.పది వేల నుంచి రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. డబుల్ ఓటీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు పరిశ్రమల యాజమాన్యాలు కల్పించకపోవడంతో కార్మికులు రూ.26 వేల కనీస వేతనం, ఎనిమిది గంటల పనివిధానం, ఓటీ, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ నోయిడాలో 50 వేల మంది కార్మికులు పోరాటం చేస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులకు తీవ్రమైన నష్టం కలుగుతుందని హెచ్చరించారు. ఈ




కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకర్, రాజు, శ్రీనివాస్, గోపాల్,సురేష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ముఖ్యమంత్రి లక్ష్యం



**మొయినాబాద్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుధన్రెడ్డి అన్నారు. గురువారం మొయినాబాద్ రైతు వేధికలో 99 రోజుల అభివృద్ధి ప్రణాళిక ప్రజా పాలన కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను ఆమె వివరించారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వాలనతో ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుధన్రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మండలంలోని 468 సంఘాలకు 41.09 కోట్ల చెక్కును రుణాల కింద పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల సాధికారత అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, జీవిత భీమా పథకం, మధ్యాహ్న భోజన పథకం, మహిళా సంఘాలలో ఉన్న వారికి రుణాల మంజూరు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఆయన ముందడుగు వేశారని సూచించారు. మహిళలు అన్ని రంగాలలో పాల్గొన్నప్పుడే రిజర్వేషన్లను సమానత్వంగా పాలుపంచుకోని పోటీతత్వంగా ఎదుగుతారని సూచించారు. ఇందు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి ఎంతో ప్రోత్సహం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 99 రోజుల కార్యక్రమంలో ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళికలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడంతో పాటు వాటిని అమలు చేయడంలో అధికారులు ఎంతో కృషి చేయడం మొయినాబాద్ మండల అధికారులను ఆయన అభినందించారు. అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులతో అధికారులు కలిసి పని చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, మండల ప్రత్యేక అధికారి కిష్టన్రావు, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, ఎంపివో వెంకటేశ్వర్రెడ్డి, మండల విద్యాధికారి మల్లయ్య, జిల్లా సమైక్య మహిళా సంఘాల అధ్యక్షురాలు అశ్వినియాదవ్, సర్పంచ్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్రెడ్డి, జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్, పట్నం రాంరెడ్డి, సర్పంచ్లు అర్చన అబియ్ రెడ్డి, శ్రీదివ్యామురళీధర్రెడ్డి, గోడుగు యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, శ్రీలతరెడ్డి, కవిత, శివకుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు




**శామీర్‌పేట, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు లభిస్తాయని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయము వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా తుర్కపల్లి, లాల్ గడి మలక్ పేట వార్డులలో లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉన్నదని కౌన్సిల్ సభ్యులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వేసవి కాలంలో మంచినీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్, వైస్ చైర్ పర్సన్ కన్ రెడ్డి మాలతి, కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలి

- వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి
- వాక్సెన్ యూనివర్సిటీలో విద్యార్థులకు అవగాహన
- అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పకుండ పాటించాలని అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాలుగో రోజు గురువారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ వాక్సెన్ యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ హాజరైనారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలకు ఎవరూ అతీతులు కాదని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని అన్నారు. అతివేగం క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. గమ్యాన్ని చేరుకోవడం ఎంత ముఖ్యమో, సురక్షితంగా చేరుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాహ్ వీర్ పథకం ఒక ముఖ్యమైన రోడ్డు భద్రత కార్యక్రమమని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్ -- మొదటి 60 నిమిషాలు) బాధితుడికి సహాయం చేసి ఆసుపత్రికి చేర్చిన వ్యక్తిని "రాహ్ వీర్" అని పిలుస్తారని చెప్పారు. అటువంటి వ్యక్తులకు ప్రభుత్వం తరపున రూ. 5,000 వరకు నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. వాక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ సేఫ్టీ హెల్మెట్ గురించి యాజమాన్యం వివరిస్తూ, ప్రమాదం లేదా అనుకోని పరిస్థితుల్లో హెల్మెట్‌లో అధిక ఉష్ణోగ్రత (హీట్) ఉత్పత్తి అయితే సెన్సార్ ఆక్టివేట్ అయ్యి హెల్మెట్ చల్లబడే విధంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం చేరే విధంగా ఇది పనిచేస్తుందని, ప్రమాదం జరిగిన సమయంలో వాహనం వేగం ఎంత ఉందో కూడా నమోదు అవుతుందని చెప్పారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ఎస్ఓఎస్ సౌకర్యం కూడా ఇందులో కల్పించబడిందని తెలిపారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశంతో వారం రోజుల పాటు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ, డ్రైవర్ ముందుగా తన వాహనం పరిస్థితి గురించి తెలుసుకుని ఉండాలని, ప్రయాణించే రహదారి పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వాహనాన్ని ఎంత వేగంగా నడుపుతున్నామన్నది కాదు, ఆ వేగాన్ని నియంత్రించగలగడం ముఖ్యమని అన్నారు. అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని, డ్రైవింగ్ సమయంలో పూర్తి ఏకాగ్రతతో ఉండాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. విశ్రాంతి లేకుండా నిరంతరం డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. డ్రైవింగ్‌లో ఎంత నైపుణ్యం ఉన్నా ఎదుటివారి తప్పిదాల వలన కూడా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, కాబట్టి డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాక్సెన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరు రామకృష్ణ వర్మ, డైరెక్టర్ సెక్యూరిటీ శశికాంత్ ఉపాధ్యాయ్ (రిటైర్డ్ ఐజీ), డీన్ – స్కూల్ ఆఫ్ లా డా. ఎ. శ్రీలత, డీన్ – స్కూల్ ఆఫ్ సైన్స్ డా. దయాశంకర్, అసోసియేట్ డీన్ డా. బ్యూటీ పాండే, రిజిస్ట్రార్ శ్రీ అభిజీత్ శిరోద్కర్, డీన్ -- ఆర్కిటెక్చర్ సోనియా గుప్తా, హెడ్ ఆఫ్ సెక్యూరిటీ డా. ఏవీఎస్ శ్రీధర్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్ఐ రాజేష్ నాయక్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి 9వ రోజు నిరవధిక సమ్మె



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు 9వరోజైన గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టిజన్లకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని,2026 పిఆర్ సి, మెడికల్ లీవులు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గ్రేడ్ చేంజ్,పీస్ రేటు కార్మికులకు, అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి, ప్రణీత, నాగమణి, జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్,ప్రదీప్ గౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్, బి.చంద్ర భానప్ప, బి.సంపత్ కుమార్, పాపయ్యోల రమేష్, వై.సంగమేశ్వరరెడ్డి, నాగరాజు, వెంకటచారీ, రాజుగౌడ్, మొగులయ్యా, బుస్ససత్యం గుప్తా, పోలశ్రీనివాస్, రమావత్ హరినాయక్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్, వై.జైపాల్ రెడ్డి, యూసుఫ్,కిషన్, అశోక్, మోహన్,ఎపరశురామ్, నర్సింలు, సుధాకర్, సాయిలు, యాదగిరి, సూర్యరమేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, గంగారం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు గురువారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

## అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య



**రాయికోడు, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** అధికారులు ప్రజా ప్రతినిధులందరూ సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి జరగడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య స్పష్టం చేశారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై మండల స్పెషల్ ఆఫీసర్ జగదీష్, అధ్యక్షతన రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో పని చేసినప్పుడే అనుకున్న అన్ని ఫలితాలు సాధించవచ్చు అన్నారు.అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రైకోడ్ మండలంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి అన్నారు. అల్లాదుర్గం మెటల్ కుట రహదారి నిర్మాణానికి 215 కోట్లు, బుదేరానుండి శిరూర్ రోడ్డు నిర్మాణానికి 75 కోట్లు, సింగీతం నుండి కోడూరు వరకు డబల్ రోడ్డు నిర్మాణానికి నిధులతోపాటు కుసునూరు గ్రామ బ్రిడ్జి నిర్మాణానికి ఐదున్నర కోట్ల రూపాయల నిధులు మంత్రి దామోదర్ మంజూరు చేయించారు అన్నారు. అన్ని గ్రామాల్లో పర్మిషన్ రోడ్లు, మెటర్ రోడ్లు, సిసి రోడ్లు, కాంపౌండ్ వాల్స్, మహిళా బిల్డింగ్స్ నిర్మాణాల పనులు తుది దశకు చేరుకున్నాయి అన్నారు. అధికారులు ప్రజలకు జవాబు దారిగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖ పనులపై సభకు వివరించారు. అనంతరం అధికారులు జిల్లా లైబ్రరీ చైర్మన్ అంజయ్య తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ లకు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి డిజిపి ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ పై ఎస్సై చైతన్య కిరణ్ ప్రజాప్రతినిధులు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎ షరీఫ్, ఎంఈఓ నర్సింలు, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, తాసిల్దార్ ఆశాజ్యోతి, ఎక్సైజ్ ఎస్సై రమేష్, ఏఈలు దేవయ్య, తహ, ఏపీవో రమేష్, హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, పలు శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి



**పెబ్బేరు, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** తెలంగాణలో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ఆ దిశగానే పని చేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పెబ్బేరు మండల కేంద్రంలో సహారా ఫంక్షన్ హాల్ నందు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కార్యక్రమం తో పాటు 'అరైవ్ అలైవ్ ' రోడ్డు భద్రత కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి తో పాటు, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రెండున్నరేళ్ళ క్రితం కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ఆ దిశగానే పని చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం తో పాటు ప్రజల భద్రత కూడా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతని, అందులో భాగంగానే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను నిలుపుకోవాలని సూచించారు. ప్రస్తుతం పామాయిల్ కు మంచి డిమాండ్ ఉందని రైతులు పంట వేయడానికి ముందుకు రావాలని తెలియజేశారు. పెబ్బేరు మండలంలో 4138 మంది రైతు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఈ రెండున్నర ఏళ్లలో ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు అందించింది, ఏ విధమైన అభివృద్ధి చేసింది అనే విషయాలను ప్రజలకు వివరించడమే కాకుండా, ఇంకా ప్రజలకు కావాల్సిన అవసరాలను తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను ప్రజలకు వివరించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని గుర్తు చేశారు. హెల్మెట్ ధరించి బైక్ నడపాలని చెప్పారు. ఈ సంవత్సరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా 26 మంది మరణించిన విషయాన్ని తెలుపుతూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంభించాలని సూచించారు. డిఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో యాదయ్య, డిటిఓ మానస, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ సుమిత్ర, కార్మిక శాఖ అధికారి రవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, నాయకులు యాదయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్



**శివ్వంపేట, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా హార్టీ కల్చర్ అధికారి, మండల ప్రత్యేక అధికారి ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివంపేటలోని రైతు వేదికలో గురువారం అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యచరణ ప్రణాళిక పై మండల స్థాయి సమావేశం నిర్వహించి, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై కులంకశంగా చర్చించి, శ్రోతలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు నూతన ఒరవడిలకు శ్రీకారం చుట్టాలని అందులో భాగంగానే వరికి బదులు ప్రత్యామ్నాయంగా కోతుల బాధ పందుల బాధ లేకుండా ఫామ్ ఆయిల్ పంటలను సాగు చేయాలని ఆయన సూచించారు. ఆ తర్వాత మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పై ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ వివరించారు. అంతకుముందు స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేసి, రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటిస్తామని, ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరిస్తామని, కచ్చితంగా హెల్మెట్ ధరిస్తామని వారందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ఇదే సమావేశంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి పోషకాహార నాణ్యత ప్రమాణాలపై, పోషక ఆహారం తీసుకోకపోతే జరిగే అనర్థాలపై సభకు వచ్చిన వారందరికీ అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి పరీక్షలు నిర్వహించి కొంతమందికి అద్దాలను సైతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఉప తహసిల్దార్ షఫీయోద్దీన్, ఎస్ ఐ మధుకర్ రెడ్డి, ఎం ఈ వో బుచ్చానాయక్, ఏవో లావణ్య, స్థానిక వైద్యాధికారి సాయిసౌమ్య, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉప్పేందర్ సింగ్ షెకావత్, ఇతర ఏయేలో ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి



**నంగునూరు, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిపిఓ రవీందర్ పేర్కొన్నారు. గురువారం రోజు నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అలాగే రాబోయే రోజుల్లో అమలు చేయనున్న పథకాలను ఎంపిడిఓ మహబూబ్ అలీ వివరించారు. అంతకు ముందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ని ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరితో కలిసి డిపిఓ రవీందర్, ఎంపిడిఓ మహబూబ్ అలీ సందర్శించారు. అనంతరం కార్యక్రమ ప్రారంభంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా డిపిఓ డీపీవో రవీందర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి గవర్నమెంట్ శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ఎటువంటి పైరవీలు లేకుండా, పారదర్శక పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని స్థానిక సమస్యలైన డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక వసతులపై వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ గవర్నమెంట్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. గ్రామాల్లో నెలకొన్నా సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామ పాలకవర్గం, ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామీణ స్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలని ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. ప్రజా పాలన దిశగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని అన్నారు. అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి, ఎంఈఓ దేశిరెడ్డి, ఏపిఎం శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, పలువురు పాల్గొన్నారు.

# కోస్గి పట్టణ సమగ్రాభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా పట్టణంలో నిర్మిస్తున్న సైన్స్ మ్యూజియం పనులను చూశారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పక్కనే ఉన్న మున్సిపల్ పార్కును పరిశీలించారు.బస్టాండ్ మలుపు దారి వద్ద జంక్షన్ ఏర్పాటు కోసం అధికారులకు సూచనలు చేశారు. అలాగే రూ.10.50 కోట్లతో కోస్గి పట్టణ డంపింగ్ యార్డ్ కు సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణ పనులను డంపింగ్ యార్డుకు వెళ్లి పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తాచెదారానికి నిప్పు ఎందుకు పెట్టారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. యార్డులో మిగిలిన ఇతర పనుల ఆలస్యంపై సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.కోస్గి పట్టణంలో చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ( మురుగునీటి వ్యవస్థ) పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పూర్తిస్థాయిలో పనులు కొనసాగడం లేదని, అసలు పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే ఆనవాళ్లే కనిపించడం లేదని కలెక్టర్ పబ్లిక్ హెల్త్, అర్ అండ్ బీ, మున్సిపల్ కమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాన్ని మూడు జోన్లుగా విభజించి చేపడుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఈ ఈ విజయ్ భాస్కర్ గూగుల్ మ్యాప్ తో కోస్గి పట్టణ స్వరూపం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (తుపాను నీటి పారుదల నెట్ వర్క్) మూడు జోన్ల నిర్మాణం గురించి చిత్ర పటం ద్వారా కలెక్టర్ కు క్రుప్తంగా వివరించారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగు నీటి నిల్వ కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పట్టణంలో మందకొడిగా సాగుతున్నాయని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళి కోస్గి పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.305 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, హై మాస్ట్ లైట్లు, జంక్షన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, అప్రోచ్ రోడ్లు, మేజర్ లింక్ రోడ్స్, సీసీ, డ్రైనేజీల నిర్మాణాలు, చెరువుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితి గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ గంటన్నర పాటు చర్చించారు.అయితే కాంట్రాక్టర్ అభివృద్ధి నిర్మాణ పనులను కూలీలు లేరని, పండగలు ఉన్నాయనే కారణాలతో నిర్మాణ పనులను నెలల తరబడి నిలిపి వేస్తున్నాడని కోస్గి మున్సిపల్ చైర్మన్ ఎన్. నరేందర్, పలువురు కౌన్సిలర్లు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, విద్యుత్ శాఖ ఎస్.ఈ. నవీన్, డి ఆర్ డి ఓ మొగులప్ప, పంచాయతీరాజ్ ఈ.ఈ. అశోక్, ఆర్ అండ్ బి అధికారి శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సరిత, మున్సిపల్ ఇంజనీర్, మేనేజర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### పట్టణ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం కోస్గి పట్టణంలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ సభకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ ఎన్ నరేందర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పట్టణ సభ లో పాల్గొన్నారు. సభను జయ జయయే తెలంగాణ జననీ జయ కేతనం పాటతో ప్రాంభించారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు సభలో సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. కోస్గి మున్సిపాలిటీ సమగ్ర స్వరూపాన్ని, ఇంతవరకు మంజూరైన నిధులు చేసిన అభివృద్ధి పనులు, పట్టణంలో అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కమిషనర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం 290 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారని, అందుకుగాను 10 వేల కోట్లకు పైగా మహిళలకు ఆదా అయిందని తెలిపారు.అలాగే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను అందజేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఆగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఖిలా వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 'విజిలెన్స్' తనిఖీలు



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో డాక్యుమెంట్లు, స్టాంప్ డ్యూటీల్లో అవకతవకలు జరుగుతున్నా యనే సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ వెంకట్ లాల్‌ను అధికారులు విచారించారు. డీఎస్పీ మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో పలు రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. దాడుల సమాచారం ముందుగానే తెలిసిన డాక్యుమెంట్ రైటర్లు తమ షెటర్లు మూసివేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఇదిలా ఉండగా సాయంత్రం వరకు తనిఖీలు కొనసాగినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణపై గ్రామసభ



**కాటారం ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పోలారం ట్యాంక్ వెళ్లే ప్రధాన కాలువ నిర్మించే పనుల్లో భాగంగా బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులతో బయ్యారం గ్రామపంచాయతీ వద్ద కాటారం నయాబ్ తాసిల్దార్ మార్క రామ్మోహన్ గౌడ్, భూ సేకరణ స్పెషల్ నాయబ్ తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంకు సంబంధించిన పోలారం సిస్టర్న్ కింద ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్ కాలువల తవ్వకానికి బయ్యారం గ్రామానికి చెందిన 23 ఎకరాల 10 గుంటల భూమిని కాలువల కోసం తీసుకుంటున్నట్లు ఈ సమావేశంలో వివరించారు. గ్రామ సభలో భూములు కోల్పోయే రైతులకు భూముల విస్తీర్ణ వివరాలు తెలియజేస్తూ పరిహారంపై చర్చించారు. ఈ గ్రామ సభలో బయ్యారం గ్రామ సర్పంచ్ ఇనుగాల లింగయ్య , ఉప సర్పంచ్ జాగరి శ్రీనివాస్ వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## కన్న తండ్రినే కడతేర్చిన తనయుడు

- పెళ్ళి చేయడం లేదని హత్య
- కనికి గ్రామంలో విషాదం

**కౌటాల ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** కన్న తండ్రి అన్న మానవత్వం మర్చి పోయి మద్యం మత్తులో తండ్రిపై పిడి గుద్దులు గుద్ది ప్రాణాలు తీసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కొమరం భీం జిల్లా కౌటాల మండలం కనికి గ్రామంలో కుశబ్ రావు అనే అతనికి పెళ్లి చేయడం లేదనే కోపంతో మద్యం మత్తులో తనయుడు తండ్రిని హత్య చేసిన ఘటన కలకలం రేపింది. ఎస్ ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అవుత్కర్ కుషబ్ రావు తన తండ్రి లింబాజీ(69)తో వివాహ విషయంపై గొడవపడ్డాడు. ఆగ్రహంతో తండ్రి కడుపుపై దాడి చేయగా తీవ్ర గాయాలు అయ్యాయి. లింబాజీని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొంది ఇంటికి వచ్చిన తర్వాత బుధవారం మృతి చెందాడు. లింబాజీ , పెంతుబాయి దంపతులకు ముగ్గురు కుమారులు, పెద్ద కుమారుడు కరీంనగర్ లో, మూడో కుమారుడు కాళేశ్వరం లో పని చేస్తున్నారు. రెండవ కుమారుడు కుశాబ్రావు ఇంట్లోనే ఉంటూ కూలి పని చేస్తున్నాడు. మంగళవారం మద్యం మత్తులో దాడి చేయగా తీవ్ర గాయాలతో బుధవారం మృతి చెందాడు. భార్య పెంటు బాయి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



**తాండూర్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజవర్గం తాండూరు మండలంలో నకిలీ, అనుమతిలేని పత్తి విత్తనాలు , నిషేదిత గడ్డి మందు లాంటివి ఎవరు విక్రయించినా, వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. బోయపల్లి బోర్డు జాతీయ రహదారి సమీపంలో ఆటోలో బెల్లంపల్లి నుంచి తాండూర్ కు నకిలీ పత్తి విత్తనాలను డంపు చేస్తున్నారనే సమాచారంతో తాండూర్ ఎస్సై కే ప్రసాద్, వ్యవసాయాధికారిణి సుష్మా, సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా ఆటోలో నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు గుర్తించారని తెలిపారు. రూ. 3లక్షలు విలువగల 150 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. భీమిని మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తు బోయపల్లి బోర్డు గ్రామంలో ఉంటున్న వూస సుబ్బారావు, తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒగరి సమ్మయ్య, తాండూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మగ్దూంను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరు కొనుగోలుదారులు నకిలీ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా గుంటుపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు డీసీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది, తాండూర్ మండల వ్యవసాయాధికారిని సుష్మ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూలర్ షాక్ కొట్టి మహిళ మృతి



**కడెం, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** కూలర్‌లో నీళ్లు పోస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సంభవించి షాక్ కొట్టడంతో మహిళ మృతి చెందిన ఘటన కడెం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పాత మదిపడగా గ్రామానికి చెందిన కారం సుశీల అనే మహిళ (49) గురువారం రోజున ఇంట్లో మధ్యాహ్నం సమయంలో కూలర్లు నీళ్లు పోస్తుండగా కరెంట్ షాక్ తగిలి సుశీల అక్కడికక్కడే మృతి చెందింది. అది గమనించిన తమ తండ్రి అబ్రహం సుశీలను కాపాడ పోయే ప్రయత్నంలో అబ్రహం కు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.

## డీసీసీ కార్యదర్శిగా ఇందారపు చంద్రయ్య నియామకం



**మల్హర్, ఏప్రిల్ 16(జనంసాక్షి) :** జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా మల్హర్ మండలం లోని తాడిచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందారపు చంద్రయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కర్ణకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి చంద్రయ్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు అధ్యక్షులు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు, ట్రేడ్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి కి, జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణకర్ కు, సర్పంచ్ బండి స్వామి, మాజీ సర్పంచ్ దన్నపనేని అశోక్ రావు,గ్రామ శాఖ అధ్యక్షులు కేశరపు చంద్రయ్య,ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్ లకు అలాగే పార్టీ ముఖ్య నాయకులకు చంద్రయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 20న సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం పర్యటన

- సోమవారం ముక్తేశ్వరస్వామి ఆలయం సందర్శన



**కాళేశ్వరం, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 20వ తేదీన భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. సరిగ్గా 2023 ఎన్నికల సమయంలో ప్రాజెక్టు లోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇప్పటికీ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను బీఆర్ఎస్ ఖండిస్తోంది. అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరిపి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించింది. అయితే ఈ కమిషన్ ఏర్పాటు అది సమర్పించిన నివేదికపై బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా దానికి సంబంధించిన తుది తీర్పు త్వరలోనే వెల్లడి కానుంది. ఈ సందర్భంగా 20 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి మహాదేవపూర్ మండలం లో పర్యటించనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిని స్వయంగా పరిశీలించనున్నారు. గతంలో కుంగిపోయిన ఈ మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన పియర్లను పరిశీలించి పునరుద్ధరణ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. అదే సమయంలో కాళేశ్వరం పరిధిలోని గోదావరి నది వద్ద నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్ల పై , 2027 లో జరిగే గోదావరి పుష్కరాల పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేయనున్నారు. అలాగే ఆలయ పున ప్రతిష్ట పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం కాళేశ్వరం విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు స్థానిక త్రివేణి విశ్రాంతి భవనంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి గర్భాలయం, శుభానంద దేవి అమ్మవారు ఆలయాల పునరుద్ధరణ, పున ప్రతిష్ట ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ , కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, ఈఓ మహేష్, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, మౌలిక వసతుల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. ఈనెల 20వ తేదీన ఆలయ పున ప్రతిష్ట పనుల శంకుస్థాపన కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం విచ్చేసి శంకుస్థాపన చేయనున్నందున శిలాఫలకం, భూమి పూజ పనులకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ హనుమంతరావు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శుభానంద దేవిని,సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి చేపట్టనున్న పనులను ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ కమిషనర్ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి అనుబంధ ఆలయాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. అలాగే మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం సరస్వతి అంత్య పుష్కరాలు అట్టహాసంగా జరపనున్న నేపథ్యంలో త్రివేణి సంగమం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇరవై ఒక్క కోట్ల నిధులతో చేపట్టిన మ్యూజియం , అక్షరాభ్యాసం మండపం , క్యూలైన్ల మండపంపై సాలారం నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. తాజాగా స్థానిక బిఆర్ఎస్ నాయకులు కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మోహన్ శర్మ పై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి గానీ , స్థానిక మంత్రి శ్రీధర్ బాబు కానీ ఈ విషయంపై ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## విద్యను వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి

- ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి
- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** విద్యను వ్యాపారంగా మార్చుకొని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు హన్మకొండ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు కీలక డిమాండ్లను కలెక్టర్ కు వివరించి వినతిపత్రం అందించారు. వారు స్పందించి ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణం చర్యలకు పూనుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్. రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర కార్యదర్శి హాకీం నవీద్, ఏ.ఐ.ఎస్.ఎఫ్. హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, పి.డి.ఎస్.యు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నరసింహ రావు, పి.డి.ఎస్.యు.హన్మకొండ అధ్యక్షులు బి.వంశీ కృష్ణ లు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేపట్టడం వల్ల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాల విక్రయాలు జరపడం అనైతికమని, పాఠ్యపుస్తకాలు ముందస్తుగా అమ్మడమే కాకుండా విచ్చలవిడిగా ఎమ్మార్పీ ధరలకు మించి అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలుదోపిడి చేస్తున్నారని దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోపి.డి.ఎస్.యు.హన్మకొండ-వరంగల్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు బొజ్జ జ్యోతి, లావణ్య, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## జడ్జి మంత్రి రామకృష్ణ సునీతను కలిసిన జిల్లా కలెక్టర్

**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మంత్రి రామకృష్ణ సునీతను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదాలత్ వద్ద ఉన్న కోర్టు సముదాయంలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో జస్టిస్ మంత్రి రామకృష్ణ సునీతను జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.


## ధాన్యం సేకరణ ప్రక్రియలో వేసవి దృష్ట్యా రక్షణ చర్యలు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 16(జనంసాక్షి):** ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర వడగాలులు, ఉష్ణోగ్రతల దృష్ట్యా వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు, సేకరణ పనులను నిర్వహించే సిబ్బందిని రక్షించడానికి నిర్దిష్ట చర్యలను తప్పక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, మంచిర్యాల, గద్వాల్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం అత్యవసర హెచ్చరికను జారీ చేసిందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడ కల్పించేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులు, హమాలీలకు వడదెబ్బ తగలకుండా నివారించడానికి చల్లటి తాగునీరు, మజ్జిగ, ఓ.ఆర్.ఎస్. అందించే "చలివేంద్రాలను" ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురి కాకుండా రైతులు తమ ధాన్యాన్ని ఉదయం 11 గంటల లోపు,సాయంత్రం 4 గంటల తర్వాత తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల మధ్య కాలంలో ధాన్యం దించడం, తూకం వేయడం వంటి శారీరక శ్రమతో కూడిన బహిరంగ పనులను పరిమితం చేయాలని, రైతులు ఎండలో వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి, ఖచ్చితమైన టోకెన్, అపాయింట్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ఐస్ ప్యాక్‌లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక థర్మామీటర్లు కలిగిన ప్రథమ చికిత్స కిట్లు తప్పక అందుబాటులో ఉండాలని తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,108 అంబులెన్స్ సేవకు సంబంధించిన సంప్రదింపు వివరాలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలను గుర్తించేలా అధికారులు, పర్యవేక్షకులకు తగిన శిక్షణ ఇవ్వాలని, కళ్లు తిరగడం, వికారం కలగడం, గుండె వేగంగా కొట్టుకోవడం, గందరగోళం,తీవ్రమైన అలసట లక్షణాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. వడదెబ్బకు గురైన వారిని ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు దాహం వేయకపోయినా తరచుగా నీరు త్రాగాలని, టీ,కాఫీకి దూరంగా ఉండాలని, తలను కప్పుకోవడానికి గొడుగులు, టోపీలు, దూది తువ్వాళ్లను వినియోగించాలని, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులను ధరించాలని తెలిపారు. కొన్ని ప్రదేశాలలో తీవ్రమైన వేడి కారణంగా, అకస్మాత్తుగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని, ఈ సందర్భంలో వరి తడవకుండా నివారించడానికి టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి దాన్యం కొనుగోలు ప్రక్రియను ఇలాంటి అవాంతరాలు, అవాంఛనీయ లేకుండా విజయవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## చెన్నారావుపేటలో యువకుడి అదృశ్యం



**చెన్నారావుపేట, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** చెన్నారావుపేటలో యువకుడు అదృశ్యమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన ఇళ్ళ రాజేంద్రప్రసాద్ చెన్నారావుపేట గ్రామంలో మీసేవ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం రాత్రి ఇంట్లో గొడవ జరిగింది. గురువారం తెల్లవారుజామున 4 గంటల నుండి రాజేంద్రప్రసాద్ ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో చుట్టుప్రక్కల గ్రామాలలో వెతికిన అతని ఆచూకీ దొరకలేదు. అతని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

## వివాహేతర సంబంధంతో భర్త హత్య

- నిందితుల అరెస్టు

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** వివాహేతర సంబంధంతో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య, నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన మడికొండ సుమన్, లావణ్యలు భార్యాభర్తలు. సుమన్ (30) ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా లావణ్య నరేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. ఈ నేపథ్యంలో లావణ్య భర్త సుమన్‌ను, హతమార్చేందుకు నరేష్‌తో కలిసి గోవిందరావుపేట గ్రామానికి చెందిన వెంకటేష్‌తో 5 లక్షల సుపారీ ఒప్పందం కాగా, పథకం ప్రకారం వెంకటేష్, సుమన్‌తో పరిచయం పెంచుకొని, మద్యం సేవించి, గోవిందరావుపేట గ్రామం పక్కన ఫ్రూట్ ఫామ్, సమీపంలోని పంట చేల వద్దకు తీసుకొని వెళ్లి, వెంకటేష్ సుమన్ ను, పెట్రోల్ పోసి అతి దారుణంగా చంపి అస్థికలను దెయ్యాలవాగులో కలిపాడు. సుమన్ తండ్రి ఫిర్యాదు మేరకు పరకాల పోలీసులు, నిందితుడు వెంకటేష్‌ను పట్టుకున్నారు, పసర సీఐ దయాకర్, ఎస్ఐ తాజుద్దీన్, పరకాల పోలీసులకు సహకరించారు.

## కుబీర్‌లో 3 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం



**కుబీర్, ఏప్రిల్ 16, (జనంసాక్షి):** నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో సంభవిస్తున్న వరుస అగ్నిప్రమాదాలు స్థానిక రైతులను కలవరపెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట, కళ్ళముందే కాలి బూడిదవుతుండటంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. కుబీర్ మండల కేంద్రానికి చెందిన రైతు పుప్పాల దత్తాత్రి తన మూడు ఎకరాల పొలంలో సాగు చేసిన మొక్కజొన్నను కోసి కుప్ప వేశాడు. గురువారం ఉదయం అనుకోకుండా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో, కోసి కుప్పవేసిన పంట మొత్తం క్షణాల్లో అగ్నికి ఆహుతైంది. కష్టపడి పండించిన పంట కళ్ళముందే బూడిద కావడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. సమాచారం అందుకున్న మండల రెవెన్యూ అధికారి ఆర్ఐ నరేష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన పంట పొలాన్ని పరిశీలించారు. బాధితుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం రైతుకు సుమారు రూ. 2.40 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆయన ప్రాథమికంగా అంచన వేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మండలంలో ఈ సీజన్‌లో ఇప్పటికే 10 ఎకరాలకు పైగా వివిధ గ్రామాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో పంట కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరుసగా జరుగుతున్న ఈ సంఘటనల వల్ల చేతికొచ్చిన పంట ఏ క్షణంలో ఏమవుతుందోనని రైతాంగం జంకుతోంది. ప్రభుత్వం స్పందించి అగ్నిప్రమాదాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఇలాంటి ప్రమాదాలు పునరా వృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం సిరికొండలోని ఎ.జీ.దాస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మండల సభలో కలెక్టర్ పాల్గొన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గేయంతో సభకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ఒక్కో పథకం వారీగా అధికారులు వెల్లడించడం ద్వారా పథకాల అమలులో పారదర్శకతను చాటారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన ప్రయోజనాల గురించి సభలో తమ అభిప్రాయాలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500/-కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. రైతులకు లాభదాయకంగా ఉండేలా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పీ.ఓ)లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రలోని బారామతి ప్రాంత రైతులు ఎఫ్.పీ.ఓలను ఏర్పాటు చేసుకుని, నూతన విధానాలలో పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికంగా ఎంతో వృద్ధి సాధించారని అన్నారు. జిల్లా రైతాంగం కూడా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ సేద్యపు రంగంలో ప్రగతి సాధించాలని, ఈ దిశగా ప్రభుత్వం రైతు వేదికల ద్వారా అమలు చేస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలలో పాల్గొని పంటల సాగు విషయమై సలహాలు, సూచనలు పొందాలని కలెక్టర్ సూచించారు.

### పసుపు రైతులకు మేలు చేకూర్చడమే ధ్యేయం

కాగా, పసుపు రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, వారికి మేలు చేకూర్చడమే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు భరోసా కల్పించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశ్యంతో స్థానిక మార్కెట్ యార్డులో పసుపు అమ్మకాలలో బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడం జరిగిందని అన్నారు. పసుపు పంట క్వింటాలుకు సగటున రూ. 16,000 ధర లభిస్తోందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకూడదని, వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూస్తామని కలెక్టర్ సూచించారు.

ఇదిలా ఉండగా, సభలో పాల్గొన్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మండలంలో నెలకొని ఉన్న పలు సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారం విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సభలో మండల ప్రత్యేక అధికారి నాగూరావు, ఎంపీడీఓ మనోహర్, తహసీల్దార్ రవీందర్ రావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రామగుండం నగరాన్ని స్వచ్ఛమైన ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతాం



**గోదావరిఖని, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రైజింగ్ రామగుండంగా పేరు తీసుకువచ్చేశీదుకు మేము సైతం అంటూ ప్రతి ఒక పౌరుడు కదలి రావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 9వ డివిజన్‌లో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి వార్డు సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని ఒక స్వచ్ఛమైన అద్భుత నగరంగా తీర్చిదిద్దడం పౌరుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు.నగరంలోని నాలాల పూడిక తీత ఒక దశాబ్ద కాలంగా చేపట్టడం జరగలేదని అన్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థకు సమర్థత ,అనుభవం కలిగిన పాలక వర్గం ఏర్పడిన క్రమంలో శానిటేషన్ తో పాటు అన్ని సమస్యలు తీరిపోతాయని అన్నారు. వర్షాకాలంలో వరద ముప్పు తో పాటు దుర్గంధం నుండి ప్రజలు పడుతున్న ఇబ్బందులు నివారించడానికి పూర్తి స్థాయిలో కాంక్రీట్ కాలువ నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ కాలువ లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మునిసిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వాలని అన్నారు.వర్షాకాలం లోపు నగరంలోని అన్ని నాళాల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని అన్నారు.ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినోభా నగర్,రెల్లి వాడ లో ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడిక తొలగించి సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఎం ఎల్ ఎ, మేయర్ అధికారులకు ,సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ప్రెస్ క్లబ్ నుండి ప్రారంభించి గల్లీ గల్లీలో తిరుగుతూ మునిసిపల్ సిబ్బందికి సూచనలు ఇస్తూ పిచ్చి చెట్లు, కొమ్మలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ తాళ్లపెల్లి యుగంధర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు,నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఇ ఇ పి వి రామన్, టి పి ఎస్ నవీన్ , ఎ ఇ జమీల్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రంగు నాగ భూషణం, సూపర్ వైజర్ రవి కుమార్ , ఎలక్ట్రికల్ ఎ. ఇ. రాంజీ , వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**సిరికొండ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరికొండలో కే జి దాస్ ఫంక్షన్ హాల్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి సమావేశం లో ఎంపీడీఓ ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించి సభను ప్రారంభించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నర్సయ్య సిరికొండ మండలం లో రైతు భరోసా ద్వారా లబ్ధి పొందిన రైతుల వివరాలు మరియు రైతు రుణమాఫీ వివరాలు చెప్పడం జరిగింది. ప్రభుత్వం ద్వారా అందించబడుతున్న సబ్సిడీ యంత్రాల గురించి రైతులకు వివరించి చెప్పడం జరిగింది. ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ హందన్ గారు మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సఫాయి కార్మికుల ఇళ్ల బిల్లులను సకాలంలో అందేలా చూడగలరని సూచించారు.

## గన్నేరువరం మండలంలో మిస్సింగ్..

- వేములవాడలో ప్రత్యక్షం...
- జనంసాక్షి న్యూస్‌తో స్పందన..
- రిపోర్టర్ రాజ్ కోటికి శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు
- రిపోర్టర్ రాజ్ కోటిని అభినందించిన ఎస్సై నరేందర్ రెడ్డి




**గన్నేరువరం, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన ఖాతా లక్ష్మయ్య ఇంట్లో జరిగిన కుటుంబ కలహాల నేపథ్యంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఆయన భార్య మంగళవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, ఎస్సై నరేందర్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇంతలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష్మయ్య కనిపించినట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన కొత్తగట్టు శ్రీనివాస్, వేములవాడ దేవస్థానంలోని కళ్యాణకట్టులో పనిచేస్తూ ఉండగా లక్ష్మయ్య ను గుర్తించాడు. ఈ సమాచారం బుధవారం జనంసాక్షి న్యూస్ లో ప్రచారించిన కథనాన్ని సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల ద్వారా జనంసాక్షి రిపోర్టర్ బుర్ర రాజ్ కోటి షేర్ చేయగా, శ్రీనివాస్ వెంటనే స్పందించి లక్ష్మయ్య గురించి వివరాలు అందించాడు. అనంతరం రాజ్ కోటి ఈ విషయాన్ని ఎస్ఐ నరేందర్ రెడ్డి కి తెలియజేయడంతో, పోలీసులు కుటుంబ సభ్యులతో సంప్రదించి వేములవాడకు పంపించారు. బుధవారం రాత్రి సుమారు 11:30 గంటలకు శ్రీనివాస్ వద్ద ఉన్న లక్ష్మయ్య ను కుటుంబ సభ్యులు కలుసుకొని, మాట్లాడి తిరిగి ఇంటికి తీసుకువెళ్లారు. లక్ష్మయ్య సురక్షితంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సహకరించిన రిపోర్టర్ బుర్ర రాజ్ కోటి, కొత్తగట్టు శ్రీనివాస్ లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్సై జి. నరేందర్ రెడ్డి కూడా వారిని అభినందించారు.

# చిన్న తప్పు పెద్ద ప్రమాదానికి దారి తీస్తుంది

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పొవార్
- హాజరైన జిల్లా ఎస్పీ నరసింహా



**మునగాల, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మునగాల మండలంలోని ఆకుపాముల వద్ద గల మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులతో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి కలక్టర్ తేజస్ నందలాల్ పొవార్ మాట్లాడుతూ, చిన్న తప్పు పెద్ద ప్రమాదానికి, నష్టానికి కారణం అవుతుంది అన్నారు. నేటి యువత రేపటి దేశ భవిష్యత్తు అన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ తమ ఇంట్లోని పెద్దలకు, పక్కింటి వారికి, తమ స్థానిక ప్రాంతాల్లోని వ్యక్తులకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, పోలీస్ శాఖ, రవాణాశాఖ, ఇతర శాఖలు సంయుక్తంగా ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ బస్సులో ప్రయాణం చేసేటప్పుడు చేతులు బయట పెట్టవద్దని, రోడ్డు నియమాలు పాటించేలా పిల్లలు తల్లిదండ్రులకు తెలపాలని, రోడ్డు భద్రత నియమలపై పాఠశాలలో పాఠాలు చెప్పాలని పాఠశాల ఆధ్యాపకులను కలక్టర్ ఆదేశించారు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని కోరారు. ప్రయాణ సమయంలో తీసుకునే జాగ్రత్తలు ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేరుస్తుంది అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని, వారి కుటుంబ సభ్యులు వారి కోసం ఇంట్లో ఎదురుచూస్తుంటారని, రేపటి దేశ భవిష్యత్తు నేటి విద్యార్థులే పునాదులని, ప్రస్తుత సమాజంలో చాలా మంది నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, పిల్లలు పాఠశాలకు వెళ్ళేటప్పుడు స్కూల్ బస్సు ఎక్కడం దిగడం చేస్తుంటారని, బస్సులో జాగ్రత్తగా ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉంటారు అలాగే తల్లిదండ్రుల పట్ల పిల్లలు కూడా జాగ్రత్తగా ఉండాలి అంటే తల్లిదండ్రులు వాహనాలపై బయటకు వెళ్ళేటప్పుడు ద్విచక్రవాహనాలు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లలో వెళ్లే వారు సీట్ బెల్ట్ పెట్టుకునేలా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయాలని, అలాగూ ప్రామిస్ తీసుకోవాలని అన్నారు. రోడ్లు దాటేటప్పుడు ఇండికేటర్ వేసుకోవాలని, చేయి ఎత్తి అవతలి వాహనాలకు సూచన చేయాలని కోరారు. రోడ్డుపై ఎడమ వైపున ప్రయాణించాలని సూచించారు. నియమాలు పాటిస్తూ డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తే సురక్షితంగా గమ్యం చేరుతారన్నారు. తల్లిదండ్రులలో, అన్నలతో, బంధువులతో ప్రామీస్ తీసుకోవాలని, ఉత్తరాలు రాయాలని కోరారు. అనంతరం పాఠశాల బస్సు డ్రైవర్లకు, ఉపాధ్యాయులకు, విలేకరులకు హెల్మెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన ప్రజ్ఞ స్కూల్, గాయత్రి స్కూల్ పిల్లలు, ఉపాధ్యాయులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ రోడ్ ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ జిలానీ, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్, ఎస్ఐ అజయ్, స్కూల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రజ్ఞ స్కూల్, గాయత్రి స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయలు దుర్వినియోగం కాకుండా చూస్తున్నాం

- నగర మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** నగర పాలక సంస్థ స్వంత వాహనాలతో కాలువల్లో పూడిక తీయిస్తూ కాంట్రాక్ట్ పేర కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం కాకుండా మిగులుస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 40 వ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ కజంపురం జయప్రద రాజేందర్ తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పూడిక తీత పనులకు లక్షల రూపాయల నిధులు కేటాయిస్తూ పనులు మాత్రం తూ తూ మంత్రంగా చేపట్టడం ఆనవాయితీ గా వస్తున్నదని అన్నారు. ఈ ఆనవాయితీ కి చరమ గీతం పాడుతూ డబ్బులు వృధా చేయకుండా నగర పాలక సంస్థ స్వంత వాహనాలు, మునిసిపల్ పారిశుధ్య సిబ్బందితోనే ప్రధాన కాలువల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పూడిక తొలగించే పనులు చేపడుతున్నామని అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా తాను, స్థానిక కార్పొరేటర్‌తో పాటు పాలక వర్గ సభ్యులు, అధికార యంత్రాంగం, సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటూ పర్యవేక్షిస్తూ పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యేలా చూస్తున్నామని అన్నారు. 40 వ డివిజన్ ఉల్లి గడ్డల బజార్ లో రామన్ వారధికి ఇరువైపులా ఉన్న పెద్ద మురుగునీటి కాలువలో ఏళ్ల తరబడి నిలిచిపోయిన పూడికను పెద్ద పెద్ద యంత్రాలతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా అప్పటికప్పుడే తరలించారు. దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూనే, కాలువ ఒడ్డున ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించే పనుల్లో నగర మేయర్ మహంకాళి స్వామి, పలువురు కార్పొరేటర్లు , అధికారులు కూడా శ్రమ దానం చేశారు. ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నవారందరికీ లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో అల్పాహార ఏర్పాట్లు చేశారు. రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఇ ఇ. పి వి రామన్, టి పి ఎస్ నవీన్ , డిఇ అఫ్తాబ్ , ఎఈ జమీల్ ,సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు కారణాలు

- డీఎస్పీ సతీష్ కుమార్



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని, ప్రతిఒక్కరూ నియమ, నిబంధనలు పాటించడంతో పాటు మైండ్సెట్ కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన భద్రాచలం మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య, తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్ లతో కలిసి మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్బెల్టు ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం వద్దు... పరిమితికి మించి వాహనాలు నడపొద్దని సూచించారు. వాహనదారుడు యాక్సిడెంట్కు గురైతే తానే కాకుండా కుటుంబాన్ని బాధపెట్టినవారవుతారన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే మానవ రక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో వివిధ శాఖల అధికారులు తమతమ శాఖలో జరుగుతున్న పనులు, చేపట్టే పనులను వివరించారు. అనంతరం వివిధ సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సర్పంచ్ మందా నాగరాజు, ఎంఈవో యదుసింహరాజు, ఎస్సైలు మేడా ప్రసాద్, నాగభిక్షం, మోరంపల్లిబంజర్ పీహెచ్సీ వైద్యులు నగేష్, ట్రాన్స్కో ఏఈ ఉపేందర్, ఇరిగేషన్ ఏఈ గణేష్నాయక్, పీఆర్ ఏఈ చక్రధరా చారి, భజన సతీష్కుమార్, ఆయా పంచాయతీల సర్పంచ్లు, కార్యదర్శులు, ఐకేపీ, ఆశా, ఏఎన్ఎంలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గద్వాల చేనేత చీరలు
- ప్రజావాణిలో చేనేత స్టాల్స్ ఏర్పాటుకు సహకారం
- చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్, గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** గద్వాల చేనేత జరీ చీరలు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయని, ఇక్కడి చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో గురువారం గద్వాల అనంత ఫంక్షన్ హాల్లో నేతన్న భరోసా, చేనేత రుణమాఫీ, నేతన్న భద్రత పథకాలకు సంబంధించి చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి గద్వాల, అలంపూర్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గద్వాల జిల్లాతో పాటు వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన మొత్తం 32 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు నేతన్న బీమా కింద రూ.5 లక్షల చొప్పున చెక్కులను ఇవ్వడం జరుగుతుందన్నారు. రుణమాఫీకి సంబంధించి జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 1761 మంది కార్మికులకు రూ.11 కోట్ల, వనపర్తి జిల్లాకు చెందిన 338 మంది చేనేత కార్మికులకు రూ.2.5 కోట్ల విలువైన రుణమాఫీ చెక్కులను ఇవ్వడం జరిగిందన్నారు. నేతన్న భరోసా పథకంలో భాగంగా 5366 మంది కార్మికులకు రూ.1.61 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వివిధ చేనేత సంక్షేమ పథకాలకు నోచుకోని కార్మికులకు త్వరలోనే జియో ట్యాగ్ నెంబర్ల ను ఇప్పించి ఆయా పథకాలను వర్తింప చేస్తామన్నారు. నెల కిందట ఆరగిద్ద గ్రామంలోని పలు చేనేత మగ్గాలను పరిశీలించడం జరిగిందని, చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహనతో పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ప్రజావాణిలో చేనేత చీరల కౌంటర్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులతో కలిసి త్వరలో చేనేత సంఘాల ప్రతినిధులు, అధికారులు, కార్మికులతో సమన్వయ సమావేశం నిర్వహించి చేనేత రంగ అభివృద్ధికి చర్చించడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నూలు, పట్టు కలిపి గద్వాల చీరలను ప్రత్యేకంగా నేస్తారని, ఇలాంటి విశిష్టత దేశంలో ఎక్కడ లేదన్నారు. గద్వాల చేనేత జరీ చీరల డిమాండ్ ను అనుసరించి ఉత్పత్తి చేసేందుకు చేనేత మగ్గాల సంఖ్య పెరిగితే అందరికీ చేనేత పథకాలు అందేలా జియో ట్యాగ్ నెంబర్లు ఇప్పించడం జరుగుతుందన్నారు. చేనేత చీరల తయారీకి సహకరించే రేషం రంగుల అద్దకం కార్మికులకు, డిజైనర్లకు, జాకార్డ్ యంత్రాలను అమర్చే కార్మికులకు సైతం జియో ట్యాగ్ నెంబర్లు ఇప్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కొంతమంది మాస్టర్ వీవర్లు బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పవర్ లూమ్ చీరలను గద్వాల పేరుతో అమ్ముతున్నారని, వీటిని నిషేదించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో చేనేత వృత్తిపై ఆధారపడి అయిదు వేలకు పైగా కుటుంబాలు జీవిస్తున్నాయని, గద్వాల చేనేత బ్రాండ్ ను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. గద్వాల చేనేత పార్క్ నిర్మాణానికి గతంలోనే స్థలాన్ని కేటాయించడంతో అక్కడ కార్మికులకు కావలసిన సదుపాయాలపై తాను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. గద్వాల సంస్థానాధీశుల కాలం నుంచి తిరుమల వెంకటేశ్వర స్వామికి దసరా నవరాత్రి బ్రహ్మోత్సవాల మొదటి రోజు గద్వాల నుంచి కార్మికులు నేసి పంపిన ఏరువాడ జోడు పంచలను మొదట కట్టించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన గద్వాల చేనేతకు నూతన జవసత్వాలు రావాలంటే ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అలంపూర్ శాసనసభ్యులు విజేయుడు మాట్లాడుతూ చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న అర్హులైన కార్మికులందరికీ ప్రభుత్వ చేనేత సంక్షేమ పథకాలు అమలయ్యేలా సహకరించాలని అధికారులను కోరారు. అలంపూర్ నియోజకవర్గంలో వివిధ చేనేత పథకాలకు, రుణమాఫీకి నోచుకోని చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ముఖ్య అతిథులు, అధికారులు ఆయా చేనేత పథకాలకు సంబంధించిన చెక్కులను కార్మికులకు అందజేశారు. ఈ సమావేశంలో గద్వాల పుర చైర్ పర్సన్ జయలక్ష్మి, కౌన్సిలర్ రామలింగేశ్వర కామ్లే, చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, డీవో సుధారాణి, ఏడీవో ప్రియాంక, బాలకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.




## 19% ప్రీమియంతో విప్రో రూ.15 వేల కోట్ల బైబ్యాక్

దిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. రూ.15 వేల కోట్లతో షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం నాటి స్టాక్ క్లోజింగ్ ధరతో (రూ.210) పోలిస్తే ఇది 19 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం 60 కోట్ల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కంపెనీ పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి ఇది సమానమని, రూ.15 వేల కోట్లు మించకుండా బైబ్యాక్ చేపట్టనున్నట్లు కంపెనీ వెల్లడించింది. టెండర్ రూట్‌లో ఈ బైబ్యాక్ చేపట్టనున్నట్లు విప్రో తెలిపింది. రికార్డు తేదీ నాటికి విప్రో షేర్లు కలిగిన వాటాదారులు ఈ బైబ్యాక్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని పేర్కొంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూపు సభ్యులు ప్రతిపాదిత బైబ్యాక్‌లో పాల్గొనేందుకు సంకేతాలు ఇచ్చారని తెలిపింది. రికార్డు తేదీ వివరాలను త్వరలో వెల్లడిస్తామంది. 2019లో రూ.10,500 కోట్లు, 2020 నవంబరులో రూ.9,500 కోట్లు, 2023లో రూ.12వేల కోట్లతో విప్రో బైబ్యాక్ చేపట్టింది. తాజా బై బ్యాక్ విప్రో చరిత్రలో భారీ బైబ్యాక్‌గా నిలవనుంది.మరోవైపు విప్రో తన త్రైమాసిక ఫలితాలను కూడా గురువారం ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం 2 శాతం క్షీణించి రూ.3502 కోట్లకు పరిమితమైంది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలపాల ద్వారా వచ్చే ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.24,236 కోట్లుగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోల్చినప్పుడు విప్రో లాభంలో 12 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం.

## 'బిందీ-తిలకం' అది పాత సర్క్యులర్.. స్పందించిన సీఈఓ

తన సిబ్బంది మతపరమైన గుర్తులు ధరించవద్దని ప్రముఖ కళ్లజోళ్ల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ ఆదేశించిందంటూ ఒక సర్క్యులర్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. అది తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వివాదంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పీయూశ్ బన్సల్ (ఖవఎబీబష్త్ర ఃజీనిబజీశ్రీ) స్పష్టత ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?లెన్స్‌కార్ట్ సిబ్బంది స్టైల్ గైడ్ అంటూ నెట్టింట్లో కొన్ని పాయింట్లు వైరల్ అయ్యాయి. వాటి ప్రకారం.. తన స్టోర్లలో సిబ్బంది నలుపు రంగు హెడ్‌స్కార్ఫ్, నలుపు తలపాగాలు ధరించడానికి అనుమతి ఉంది. తిలకం, బిందీ పెట్టుకోవడానికి మాత్రం అనుమతి లేదు. ఈ పాయింట్లు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మతపరమైన పక్షపాతం చూపిస్తున్నారంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ వ్యవహారంపై బన్సల్ ఎక్స్ వేదికగా స్పష్టత ఇచ్చారు. "లెన్స్‌కార్ట్‌కు సంబంధించి ఒక అసత్యప్రచారం జరుగుతోంది. బిందీ, తిలకం సహా ఎలాంటి మతపరమైన వ్యక్తీకరణలపైన కూడా మా సంస్థలో ఆంక్షలు లేవు. మేం ఎప్పటికప్పుడు మా మార్గదర్శకాలను సమీక్షిస్తూనే ఉంటాం. పాత విధానాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించవు. ఈ గందరగోళం పట్ల క్షమాపణలు కోరుతున్నాం" అని ఒక ప్రకటన విడుదల చేశారు.

# యుద్ధంతో భారత ఎగుమతులు డీలా

### మార్చిలో 7.44% క్షీణత



**దిల్లీ:** ఈ ఏడాది మార్చిలో మన దేశ వస్తు ఎగుమతులు 7.44 శాతం తగ్గి 38.92 బిలియన్ డాలర్లు (రూ.3.5 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు కూడా 6.51 శాతం తగ్గి 59.59 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది మార్చిలో దిగుమతులు 63.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి వంటి ప్రధాన వాణిజ్య మార్గాల్లో ఆటంకాలు ఏర్పడటం ఇందుకు కారణమైంది. ఫలితంగా మార్చిలో దేశ వాణిజ్య లోటు 20.67 బిలియన్ డాలర్లుగా ఉంది. 2025-26లో ఇలా: సవాళ్లు ఉన్నప్పటికీ.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు 4.22% పెరిగి 860 బిలియన్ డాలర్లకు చేరాయి. మొత్తం వస్తు ఎగుమతులు 437.7 బిలియన్ డాలర్ల నుంచి 1% వృద్ధితో 441.78 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 721.2 బి.డాలర్ల నుంచి 774.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2025-26లో సేవల ఎగుమతులు 418.31 బిలియన్ డాలర్లుగా అంచనా వేస్తున్నారు. ఇరాన్- అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా మార్చిలో పశ్చిమాసియా దేశాలకు భారత్ ఎగుమతులు 57.95 శాతం పడిపోయాయని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. ఇదే సమయంలో అక్కడ నుంచి దిగుమతులు కూడా 51.64% తగ్గాయని అన్నారు. ఇతర దేశాలకు మన ఎగుమతులు బలంగానే ఉన్నాయని స్పష్టం చేశారు. మార్చిలో ముడిచమురు దిగుమతులు 35.91% తగ్గి 12.18 బి.డాలర్లకు చేరాయి. 2025-26లో ఇవి 6.37% తగ్గి 174 బి.డాలర్లకు పరిమితమయ్యాయి.గత నెలలో పసిడి దిగుమతులు 31.63% క్షీణించి 3.06 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

## అనిల్ అంబానీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

**దిల్లీ:** వ్యాపారవేత్త అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. అనిల్ అంబానీ, రిలయన్స్ కమ్యూనికేషన్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే, బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతినిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని హైకోర్టుకు సూచించింది.బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ తన, రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఖాతాలు మోసపూరితమైనవని ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ అనిల్ అంబానీ తొలుత బాంబే హైకోర్టు సింగిల్ బెంచ్ ముందు సవాల్ చేశారు. దీంతో వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్‌లోనూ చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. ఈక్రమంలో మూడు బ్యాంకులు, ఆడిట్ సంస్థ బీడీఓ ఇండియా ఎల్‌ఎల్‌పీ ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లాయి. దీంతో డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేస్తూ తదుపరి చర్యలకు అనుమతిచ్చింది. ఈ క్రమంలోనే అనిల్ అంబానీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడా ఎదురుదెబ్బ తగిలింది.




### లాభాల్లో ప్రారంభమై నష్టాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. యుద్ధం త్వరలో ముగియొచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా బ్యాంక్, ఆటోషేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. అమెరికా-ఇరాన్ చర్చల పురోగతిపై ఉన్న అనిశ్చితి కూడా ప్రభావం చూపింది. సెన్సె?క్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెయ్యి పాయింట్ల మేర పతనమైంది.సెన్సెక్స్ ఉదయం 78,677.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,111.24) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,730.32 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత యూటర్న్ తీసుకున్న సూచీ.. 77,674.93 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 122.56 పాయింట్ల నష్టంతో 77,988.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 34.55 పాయింట్ల నష్టంతో 24,196.75 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఇన్ఫోసిస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4808 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ధరలు పెంచిన హెచ్‌యూఎల్

### లిరిల్, డవ్, పియర్స్ సబ్బులు ప్రియం

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సబ్బుల ధరలను పెంచేసింది. ముడి సరకు ధరలు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో ధరల పెంపు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా లిరిల్, పియర్స్, డవ్ వంటి సబ్బుల ధరలు 100 గ్రాములకు రూ.2-3 చొప్పున పెరిగాయి. అంటే సుమారు 3-5 శాతం పెరుగుదల కనిపించింది. తాజా ధరల సవరణతో లిరిల్ 100 గ్రాముల బార్ రూ.41కు చేరింది. పియర్స్ రూ.42, డవ్ సీరమ్ సోప్ రూ.60, డవ్ పింక్ సోప్ రూ.70కి పెంచింది. సబ్బులతో పాటు సర్ఫ్, రెడ్ లేబుల్ వంటి ఇతర ఉత్పత్తులూ ఈ జాబితాలో ఉన్నాయి. గతేడాది జీఎస్టీ రేట్ల సవరణతో ఉత్పత్తుల ధరలు తగ్గించిన హెచ్‌యూఎల్.. ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరలను పెంచేసింది.ముఖ్యంగా సబ్బుల తయారీలో కీలక ముడి పదార్థమైన పామ్ ఫ్యాటీ యాసిడ్ డిస్టిలేట్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హెచ్‌యూఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. సరఫరా కొరత, పామాయిల్ ధరల్లో ఒడుదొడుకుల కారణంగా ఇటీవల కాలంలో పీఎఫ్‌ఏడీ ధరలు విపరీతంగా పెరిగాయి. అదే సమయంలో పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు రసాయన ముడి పదార్థాల ధరలు పెరిగాయి. దీనికితోడు సప్లయ్ చైన్ అంతరాయాలు, రవాణా ఖర్చులు, ఇంధన ఖర్చులు కూడా పెరిగాయని హెచ్‌యూఎల్ పేర్కొంది. కమొడిటీ ధరలు, క్రూడ్, పామాయిల్, ప్లాస్టిక్ ధరల పెరుగుదలతో ఎంపిక చేసిన ఉత్పత్తుల ధరలు పెంచామని, వినియోగదారులపై అధిక భారం పడకండా జాగ్రత్తలు తీసుకున్నట్లు హెచ్‌యూఎల్ ప్రతినిధి పేర్కొన్నారు.




# ఇరాన్ రూ. 9లక్షల కోట్లు ఎక్కడున్నాయి?

**టెహ్రాన్:**అమెరికా-ఇరాన్ మధ్య రెండో దఫా చర్చలు జరగొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి యుద్ధం ముగించాలంటే తమ పది షరతులు అంగీకరించాల్సిందేనని ఇప్పటికే ఇరాన్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా స్తంభింపచేసిన ఆస్తులను విడుదల చేయడం వాటిలో ఒకటి. రెండోసారి జరిగే చర్చల్లో ఆ ఆస్తులను విడుదల చేయాలని టెహ్రాన్ గట్టిగా పట్టుబట్టొచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అసలు వాటిని ఫ్రీజ్ చేయడం ఎక్కడమొదలైంది..? ఆ మొత్తం ఎంత ఉండొచ్చన్న ప్రశ్నలు ఆసక్తిగా మారాయి. కొన్ని దశాబ్దాలుగా అమెరికా, దాని మిత్రదేశాలు విధించిన ఆంక్షలతో ఇరాన్ (ఎతీజీని) ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటూ వస్తోంది. 1979లో తొలిసారి ఆ ఆంక్షల పర్వం మొదలైంది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం సమయంలో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. అప్పుడు 50 మందికి పైగా అమెరికా ఎంబసీ సిబ్బంది, పౌరులను ఇరాన్ రెవల్యూషనరీ నాయకులు బందీలుగా చేసుకున్నారు. 444 రోజుల పాటు వారిని బందీలుగా ఉంచుకున్నారు. ఈ చర్యపై తీవ్రంగా మండిపడిన నాటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్.. ఆస్తులను ఫ్రీజ్ చేసి, బందీల విడుదల కోసం ఒత్తిడి తీసుకువచ్చారు. అనంతరకాలంలో అణుకార్యక్రమాలు, బాలిస్టిక్ క్షిపణి ప్రోగ్రామ్‌లతో ఈ ఆంక్షల తీవ్రత పెరుగుతూ వచ్చింది. దాంతో చమురు, ఇతర ఉత్పత్తుల ఎగుమతులపై వచ్చిన ఆదాయాన్ని వినియోగించుకోలేకపోయింది. ఇప్పటికీ అదే పరిస్థితి. ఆర్థిక వ్యవస్థ కుదేలై.. అక్కడి ప్రజల రోజూవారీ జీవితం అస్తవ్యస్తమవుతోంది. కొన్ని నెలల క్రితం ఇరాన్‌లో పెద్దఎత్తున ఎగిసిపడిన నిరసనలకు ఆర్థిక అస్థిరత ప్రధానకారణమైన సంగతి తెలిసిందే.అంతర్జాతీయ సంస్థ లేక ఒక దేశంలోని అధికారిక సంస్థ.. ఒక వ్యక్తి, కంపెనీ, తమ దేశంలో కార్యకలాపాలు నిర్వహించే మరో దేశానికి చెందిన ఆస్తులను తాత్కాలికంగా తమ స్వాధీనంలోకి తీసుకుంటారు. దానినే ఆస్తులను ఫ్రీజ్ చేయడం అంటారు. ఈ ఆస్తులను ఒక కోర్టు, మరోదేశం,



అంతర్జాతీయ సంస్థ, ఒక బ్యాంకింగ్ వ్యవస్థ ఫ్రీజ్ చేయొచ్చు. మనీలాండరింగ్, నేరకార్యకలాపాలు, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన దేశం/కంపెనీ/ వ్యక్తి తన ఆస్తుల నుంచి ప్రయోజనం పొందకుండా ఫ్రీజ్ చేసి అడ్డుకుంటారు. ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఇరాన్‌తో పాటు రష్యా, చైనా, నార్త్ కొరియా, వెనెజువెలా, లిబియా, క్యూబా ఉన్నాయి.

**ఆ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయంటే..?**

అమెరికా, చైనా, జపాన్, ఇరాక్, ఐరోపా ఖండంలోని దేశాల్లో ఇరాన్ ఆస్తులు ఉన్నాయి. అయితే ఆ మొత్తం ఎంతనేదానిపై మాత్రం స్పష్టత లేదు. కొన్ని కథనాల ప్రకారం ఆ మొత్తం 100 బిలియన్ డాలర్లు (రూ.9లక్షల కోట్ల పైమాటే)గా ఉండొచ్చని అంచనా. అంటే ఆ దేశ జీడీపీలో నాలుగోవంతుకు సమానం. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఇరాన్ ఆస్తులు జపాన్ వద్ద 1.5 బిలియన్ డాలర్లు, చైనా వద్ద 20 బిలియన్ డాలర్లు, భారత్ వద్ద 7 బిలియన్ డాలర్లు, ఇరాక్ వద్ద 6 బిలియన్ డాలర్లు, అమెరికా, ఐరోపాలోని కొన్ని దేశాల వద్ద 3.6 బిలియన్ డాలర్లుగా ఉండవచ్చని తెలుస్తోంది. ఖతార్ వద్ద ఉన్న 6 బిలియన్ డాలర్లను ఇరాన్‌కు చెల్లించేందుకు దక్షిణ కొరియాకు తరలించారు. అయితే అక్కడ అమెరికా ఆ ఆస్తుల్ని ఫ్రీజ్ చేసింది.ఇటీవల అమెరికా-ఇరాన్ రెండువారాల కాల్పుల విరమణకు అంగీకరించి, పాకిస్థాన్‌లో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. అయితే ఎలాంటి ఫలితం రాలేదు. విదేశాల్లో ఫ్రీజ్ అయిన కొన్ని ఆస్తులను అన్‌ఫ్రీజ్ చేయడానికి అమెరికా అంగీకరించిందని ఆ చర్చల సమయంలో కొన్ని కథనాలు వచ్చాయి. అయితే వాటిని అమెరికా ఖండించింది. ఆంక్షలు, ఇప్పుడు యుద్ధంతో ఆర్థికంగా అతలాకుతలమైన ఇరాన్‌కు ఆ ఆస్తులు వస్తే.. భారీ ఊరటనే చెప్పాలి. అందుకే త్వరలో జరగబోయే చర్చల్లో వాటికోసం పట్టుబట్టే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## సంక్షోభం కొనసాగితే విమానాలు రద్దే!..

### ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ

**న్యూఢిల్లీ:**ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న యుద్ధం కార ణంగా అనేక దేశాలు ఇంధన కొరత ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ కీలక వ్యాఖ్యలు చేసింది. ఐరోపా వద్ద జెట్ ఫ్యుయల్ మరో ఆరు వారాలకు సరిపడా మాత్రమే ఉందని తెలిపింది. చమురు సంక్షోభం ఇలాగే కొన సాగితే.. విమాన సర్వీసులు రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించింది.హర్మూజ్ జలసంధి మార్గంలో ఇంధనం, గ్యాస్‌తోపాటు కీలక సరఫరా వ్యవస్థలకు ఆటంకం ఏర్పడటం వల్ల ఎన్నడూ చూడని ఇంధన సంక్షోభం ఏర్పడిందని ఐఈఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపాయ న్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణానికి అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. దీని ప్రభావం వల్ల పెట్రోల్, గ్యాస్, విద్యుత్ ధరలు పెరుగుతాయన్నారు.



## పశ్చిమాసియా సంక్షోభం.. భారత్‌లో లక్షల మంది పేదరికంలోకి

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో.. ఇప్పటికే చమురు ధరలు మండిపోతున్నాయి. పలు దేశాల్లో నిత్యావసర సరకుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సంక్షోభం భారత్ పైనా తీవ్ర ప్రభావం చూపనుందని తాజాగా ఐక్యరాజ్యసమితి పేర్కొంది. యుద్ధం కారణంగా దేశంలోని 25 లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. 'పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు.. ఆసియా, పసిఫిక్‌లో మానవ అభివృద్ధిపై ప్రభావాలు' అనే పేరుతో యూఎన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఓ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. ఈ యుద్ధం ఆసియా, పసఫిక్ అంతటా అభివృద్ధిని తగ్గిస్తుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 88 లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని అంచనా వేసింది. చైనాలో కూడా దీని ప్రభావం అధికంగానే ఉండవచ్చని పేర్కొంది. ఇక, పెరిగిన ఇంధన ధరలు, రవాణా, ముడిసరకుల ఖర్చులు కుటుంబాల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తాయని తెలిపింది. ఆహార సంబంధిత సమస్యలు పెరుగుతాయని, ప్రభుత్వ బడ్జెట్లపై భారం పడుతుందని, జీవనోపాధిని బలహీనపరుస్తుందని వెల్లడించింది. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్‌తో సహా అనేక దేశాల్లో ఆహార భద్రత ఒత్తిళ్లు తీవ్రమవుతాయని పేర్కొంది. ఈ సంఘర్షణ సుదీర్ఘకాలం కొనసాగితే భారత్‌లో యూరియా నిల్వలు తగ్గిపోయి.. రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వెల్లడించింది. .

## పెట్టుబడులతో రండి

ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, దస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ్÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జాబితాలో ఉన్న ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారనే అర్థం వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే, వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నది వారి ప్రధాన వాదన. ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను మే 6వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ కలిగిస్తోంది. ఒకవేళ కోర్టు అనర్హత వేటు విషయంలో కఠినంగా వ్యవహరిస్తే, రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా ఉంది.

## కొత్త నిబంధనలు..

### బోర్డింగ్ మిస్సైన 120 మందికి పైగా ప్రయాణికులు




**న్యూఢిల్లీ:**ఐరోపాలో కొత్త నిబంధనల కారణంగా బోర్డింగ్ సమయంలో 120 మందికి పైగా ప్రయాణికులు ఫ్లైట్ మిస్ అయ్యారు. ఐరోపాలో తాజాగా బోర్డర్ కంట్రోల్ సిస్టమ్ అమల్లోకి వచ్చింది. ఈనేపథ్యంలో ప్రయాణికుల పాస్‌పోర్టు స్టాంపింగ్‌కు బదులు బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయాల్సిఉంది. ఈ క్రమంలోనే చెకింగ్ ఆలస్యమవడంతో వారు ఎయిర్‌పోర్టులో ఉన్నా ఫ్లైట్ ఎక్కలేకపోయారు.మిలాన్ నుంచి మాంచెస్టర్‌కు వెళ్లేందుకు 156 మంది ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకున్నారు. ప్రయాణానికి కొన్ని గంటల ముందే వారంతా విమానాశ్రయానికి చేరుకున్నారు. ముందస్తు తనిఖీల కారణంగా పాస్‌పోర్ట్(ఖజీబబజూనీతీబి) చెకింగ్ క్యూ వద్ద కనీసం 3-4 గంటల సమయం పట్టడంతో చాలామంది బోర్డింగ్ గేట్‌కు చేరుకోలేకపోయారు. 156 మందిలో కేవలం 34 మంది పాస్‌పోర్ట్లు మాత్రమే చెకింగ్ పూర్తయ్యాయి. దీంతో దాదాపు 120 మంది ప్రయాణికులు ఫ్లైట్‌ని మిస్ అయ్యారు.టెర్మినల్ లోపల చాలా రద్దీగా ఉండడంతో గంటలతరబడి క్యూ కదల్లేదని ప్రయాణికులు వాపోయారు. కొత్త పద్ధతుల్లో చెకింగ్ చేయడంతో కొందరు గంటలతరబడి నిల్చొనే ఉండటం వల్ల అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రయాణికుల కోసం విమానాన్ని కొంత సమయం ఆపినా.. తర్వాత భద్రతా కారణాల రీత్యా బయల్దేరవలసి వచ్చింది. సరిహద్దు భద్రత కారణంగా యూరోపియన్ దేశాలు కొత్తగా ఎంట్రీ/ ఎగ్జిట్ సిస్టమ్ తనిఖీని ప్రారంభించారు. దీంతో బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, డేటాబేస్ చెకింగ్ వల్లే ఈ ఆలస్యం జరిగిందని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఎక్కువ రద్దీగా ఉండే సమయాల్లో ఈ ప్రక్రియ అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పట్టొచ్చని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



# మార్క్ లేని మార్కెట్ కమిటీ చైర్మన్



## ఎక్కడా కనిపించని చైర్మన్ అజమాయిషీ

- ఆసాంతం తుమ్మల నీడలే?
- సుప్తచేతనావస్థలో ఖమ్మం ఏఎంసీ

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** అతి వినయం దూర్త లక్షణం" ఈ నానుడి ఊరికే పుట్టలేదు.. పెద్దల పట్ల వినయ, విధేయతలు ప్రదర్శించేవారు నొప్పించక, తానొవ్వక అన్నట్లు వ్యవహరిస్తారు. ఇప్పుడు ఇలాంటి వాళ్ళే సమాజంలో భేషుగ్గా మెప్పు పొందు తున్నారు. నేతల మన్ననలు పొందుతూ కీలక పోస్టుల్లో కూర్చుంటున్నారు. ఈ కోవకే చెందిన నాయకుడు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు. సౌమ్యుడిగా పేరొంది న హనుమంతరావు వినయ, విధేయతలకు పెట్టింది పేరు.. అయితే వినయమే పదవికి అలంకారమా? వినయత ఉంటే పదవిలో రాణింపు ఉండనక్కర్లేదా.? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఏఎంసీ చైర్మన్ హనుమంతరావు విషయంలో వినయాని కి పడిన మార్కులు రాణింపునకు పడటం లేదన్నది అక్షర సత్యం.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ మార్కెట్ తర్వాత అతి పెద్ద మార్కెట్ గా పేరుగాంచింది. అయితే గతంలో రైతులకు బేడీలు వేయించిన అపకీర్తిని కూడా ఈ మార్కెట్ మూటగట్టుకుంది. ఈ ఫలితంగానే రాష్ట్ర వ్యాప్తంగా అందరి చూపు ఈ మార్కెట్ పై ఉంటుంది. కాగా ప్రస్తుతం ఖమ్మం ఏఎంసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న యరగర్ల హనుమంతరావు అమాత్యుడు తుమ్మల నాగేశ్వరరావుకు వీర విధేయుడిగా చెబుతారు. ఏఎంసీ పదవి కోసం అమాత్యుని కుల ప్రాతిపదికగా అనేక మంది పావులు కదిపినప్పటికీ బీసీ సామాజిక వర్గానికి చెందిన హనుమంతరావునే ఈ పదవి వరించింది. తుమ్మలలాంటి రాజకీయ చాణక్యుని దృష్టిలో పడటం ఒకరకంగా గొప్ప విషయమే అయినప్పటికీ తుమ్మల కట్టబెట్టిన చైర్మన్ పదవిపై తనదైన మార్క్‌ను చూపించలేక పోతున్నారన్న విమర్శలు అటు రాజకీయ వర్గాల్లో ఇటు మార్కెట్ వర్గాల్లో సైతం వినిపిస్తోంది. ఏడాది కాల పరిమితితో కొనసాగే పదవిలో ఇప్పటి వరకు యరగర్ల తనదైన పట్టు సంపాదించలేకపోయారు. అయితే ఏఎంసీపై తుమ్మల నీడలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న చర్చ ఆద్యంతం సాగుతోంది. లోకల్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడి కనుసన్నల్లోనే మార్కెట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ స్థితి ఇలాగే కొనసాగితే ఇక ఈ మార్కెట్ పై చైర్మన్ "యరగర్ల మార్క్" కష్టమే అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# సదాశివపేటకు శాశ్వత తాగునీటి పరిష్కారం

- రూ.135 కోట్ల వాటర్ స్కీమ్‌కు ప్రతిపాదనలు
- సింగూర్ డ్యాం నుంచి నేరుగా మంజీరా నీటి సరఫరా
- రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యం



**సదాశివపేట, ఏప్రిల్ 16 (జనంసాక్షి):** సదాశివపేట పట్టణ ప్రజలను ఎన్నాళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కీలక అడుగులు పడుతున్నాయి. బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ యంత్రాంగంతో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్‌తో పాటు మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరా అంశంపై సవివరంగా చర్చించారు. పట్టణంలోని ప్రతి ఇంటికి రోజుకు కనీసం గంటన్నర పాటు తాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం సింగూర్ డ్యాం నుంచి నేరుగా మంజీరా నీటిని ఇంటింటికి చేర్చే విధంగా సమగ్ర వాటర్ స్కీం ప్రతిపాదించారు. ఇందులో ఇంటెక్ వెల్, ఫిల్టర్ బెడ్లు, నిలువ ట్యాంకులు, కొత్త పైపులైన్ల నిర్మాణం చేపట్టనున్నారు.

ప్రస్తుతం 60 వేల జనాభాకు రోజుకు 21 లక్షల గ్యాలన్ల మంచినీళ్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. కొత్త స్కీం ద్వారా రోజుకు 52 లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం కల్పించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వచ్చే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును రూపొందించాలని జగ్గారెడ్డి సూచించారు. ఈ మంచినీటి ప్రాజెక్టుకు సుమారు రూ.135 కోట్ల వ్యయం అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రజల అభిప్రాయాల మేరకు వ్యయం పెరిగినా అభ్యంతరం లేదని జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

ప్రాజెక్టును అమలు చేసే ముందు విస్తృతంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఏప్రిల్ 17న మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల కౌన్సిలర్ల అభిప్రాయాలు, వారి వార్డుల సమస్యలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 18న ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ఏప్రిల్ 19న ప్రజల నుంచి సూచనలు తీసుకొని తుది నివేదిక సిద్ధం చేసి తనకు, నిర్మలాకు అందజేస్తే మరుసటి రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ప్రాజెక్టుకు ఆమోదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ముందుగా తాగునీటి సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారించాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు. అనంతరం పేదలకు ప్లాట్లు, ప్రతి వార్డుకు రూ.8 కోట్ల అభివృద్ధి నిధులపై ప్రత్యేకంగా చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ శివాజీ, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, మిషన్ భగీరథ అధికారులు, పబ్లిక్ హెల్త్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు స్పెషల్ సబ్ కమిటీ

- అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తాం
- 252 జీవోలో అవసరమైన సవరణలు చేసి డిపిఆర్ఓలకు పంపిస్తాం
- నకిలీ జర్నలిస్టులకు కార్డులు ఇవ్వం : తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి




**శామీర్‌పేట్, ఏప్రిల్ 16 (జనంసాక్షి):** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల అభ్యర్థన మేరకు 252 జీవోలో అవసరమైన మేరకు సవరణలు చేసి డిపిఆర్ఓలకు పంపిస్తామని తెలిపారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో టియుడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు జారీ చేసే అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు.

సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తామని తెలిపారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని, ఆ కమిటీ నివేదిక మేరకు నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. పెద్ద పత్రికల జర్నలిస్టులేవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా యూనియన్ బాధ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులకు కార్డులు అందకుండా అడ్డుకోవాలని అన్నారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐఏఎస్, ఐపిఎస్లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చడం అభ్యంతరకరమన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సంఘం సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని, సంఘం బలోపేతం కోసం పాటుపడాలని, సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, పనిచేయడం ముఖ్యమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందే విధంగా పాటుపడాలన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహాసభలను మే 15లోగా నిర్వహించాలని, మరికొన్ని జిల్లాల సభలను జూన్ 15లోపు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు వచ్చే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు.

అంతకుముందు మూడు నెలల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలవల్ల మరణించిన 16 మంది జర్నలిస్టులకు నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారాయణ తన నివేదికను సమర్పించారు. ఈ సమావేశ నిర్వహణకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గంతో పాటు 29 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. నందిని సిద్ధారెడ్డికి సన్మానం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన నందిని సిద్ధారెడ్డిని టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ఆయన మాట్లాడుతూ తన 55 ఏళ్ల సాహిత్య జీవితంలో టియుడబ్ల్యూజేతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ ఉపాధ్యక్షులు వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, కే. సత్యనారాయణ, అజిత్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే. రాములు, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, గుండ్రాతి మధు గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్, కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీపై
# మహాధర్నాకు సిపిఐ(ఎం) మద్దతు


**ఫీజులు దోపిడీని నిరసిస్తూ 25న మహాధర్నా : సిపిఐ(ఎం) కార్యదర్శి జాన్ వెస్లీ**

- ప్రభుత్వం వెంటనే సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని తేవాలి
- ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ

**ముషీరాబాద్, ఏప్రిల్ 16 (జనం సాక్షి):** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సాగుతున్న అడ్డూ అదుపు లేని ఫీజు దోపిడీని నిరసిస్తూ విద్యార్థులు, తల్లిదం డ్రుల హక్కుల పరిరక్షణ కై ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25 న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సీపీఐ(ఎం) తన మద్దతును ప్రకటించింది. హైదరాబాదు లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో ఆల్ ఇండియా నేషనల్ రక్షా సేన పార్టీ నేతలు కలిసి, ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని మద్దతు కోరారు. ఈ మేరకు సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మద్దతు ప్రకటించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అడ్మిషన్లు, డొనేషన్లు, రీ-అడ్మిషన్ల పేరుతో విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యను సామాన్యులకు అందకుండా మారుస్తున్నాయనీ, పాఠశాలలు కేవలం విద్యా బోధనకు పరిమితం కాకుండా వివిధ రకాల విద్యార్దులకు సంబంధించినవి తమ వద్దనే కొనాలని నిర్బంధిస్తూ 'షాపింగ్ మాల్స్'గా మారిపోయాయన్నారు. విద్యా హక్కు చట్టం అమలులో ఉన్నా, నిరుపయోగంగా మారిందనీ, బలమైన ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు బరితెగిస్తున్నాయి. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజు వివరాలను పారదర్శకంగా బహిరంగపరచాలనీ, విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత అడ్మిషన్ల ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే పాఠశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేయానీ కోరారు. ఫీజుల పేరుతో సాగిస్తున్న నిలువు దోపిడీకి వ్యతిరేకంగా జరిగే ఈ మహాధర్నాకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు.

# పకడ్బందీగా ప్రజా పాలన : ఆర్డీవో రాధాబాయ్

**అంగన్వాడీలకు ఆక్వా గార్డ్ యంత్రాల పంపిణీ.. దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత.**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని వేములవాడ ఆర్డిఓ రాధాబాయ్ అన్నారు.ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేములవాడ డివిజన్ పరిధిలోని అన్ని మండల కేంద్రాలు, వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో గురువారం పట్టణ సభ నిర్వహించగా,ముఖ్య అతిథిగా ఆర్డిఓ హాజరయ్యారు. వేములవాడ అర్బన్ మండలంలో మండల సభ నిర్వహించగా ఆయా గ్రామాల సర్పంచులు,వార్డ్ సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గీతంతో ప్రారంభించారు.అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సందేశం వినిపించారు. రోడ్డు భద్రత నియమాలు వివరించారు. పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు పంపిణీ చేశారు. దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని ఇందులో భాగంగా జూన్ 12 వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజా పాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి,సంక్షేమ పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, భవిష్యత్ ప్రణాళికలు రచించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు త్వరలో బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.వేములవాడలో పట్టణ సభలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, తోట రాజు, కొండ రాజశేఖర్, కొప్పుల బాలకృష్ణ,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, అర్బన్ మండల సభలో తహసిల్దార్ జయంత్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో, అన్ని గ్రామాల సర్పంచులు,పట్టణ సీఐ వీరప్రసాద్,ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడానికి అనువైన స్థలాలు గుర్తించాలి

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ**



**గోదావరిఖని, జనంసాక్షి :** వన మహోత్సవం విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు నాటి సంరక్షించడం పై అటవీ శాఖాధికారుల సమన్వయంతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం వార్డు అధికారులకు నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆమె మాట్లాడారు.వర్షాకాలం ప్రారంభంలోనే సుమారు 1,80,000 మొక్కలు నాటేలా డివిజన్ వారీ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మొక్కలు నాటడానికి అనువైన స్థలాల గుర్తింపు తో పాటు ఏఏ జాతి మొక్కలు ఎన్నెన్ని నాటాలో సవివరంగా ప్రణాళికలో పొందుపర్చాలని అన్నారు. ఎవెన్యూ, బ్లాక్, హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ కు సరిపడా ప్రణాళిక ప్రకారం ఆయా జాతుల మొక్కలు, ఎరువు, ట్రీ గార్డులు ముందే తెప్పించి సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ కు సంబంధించి రోడ్డు వెడల్పు, విద్యుత్ తీగలు, పైప్ లైన్లు అన్నీ పరగణలోకి తీసుకొని అనువైన మొక్కలు నాటాలని అన్నారు. కాగా జన గణన, ఇందిరమ్మ ఇండ్లు ,పన్ను వసూళ్ల పురోగతి, పారిశుద్ధ్య నిర్వహణ పై కూడా ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఇఇ. పివి రామన్, డి.ఇ. షాభాజ్, ఎ.ఇ. తేజస్విని అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ రహమతుల్లా, డిఆర్ఓ కొమురయ్య, బీట్ ఆఫీసర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలకు గోల్డెన్ అవర్ కీలకం

- పోలీస్, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి : పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి
- ప్రభుత్వ ఆసుపత్రిలో అరైవ్ అలైవ్‌లో రోడ్డు భద్రతపై అవగాహన



**గోదావరిఖని, జనంసాక్షి :** "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమం షెడ్యూల్‌లో భాగంగా, గోదావరి ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ గోదావరిఖని వైద్య సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రమాదాల అనంతరం తక్షణ వైద్య సహాయం ప్రాముఖ్యతపై దృష్టి సారించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని రోడ్డు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్" (గోల్డెన్ హవర్) అత్యంత కీలకమని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటలో సరైన వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించడంలో ట్రాఫిక్ నియమాల పాటింపు అత్యవసరమని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదనే విషయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ విషయంలో వైద్య సిబ్బంది కూడా ప్రజలకు సూచనలు ఇవ్వడం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ రమేష్ గారు, పోలీస్ సిబ్బంది మరియు వైద్య సిబ్బంది పరస్పర సహకారంతో రోడ్డు ప్రమాదాల సమయంలో సమర్థవంతంగా స్పందించే విధానాలపై చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ మరియు వైద్య విభాగాల మధ్య సమన్వయం ఎంత ముఖ్యమో వివరించారు. అధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చని, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేస్తే "అరైవ్ అలైవ్" లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఆర్ఎమ్ఓ, ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, సబ్‌ఇన్‌స్పెక్టర్ రమేష్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సుమారు 80 మంది వైద్య సిబ్బంది హాజరయ్యారు.



# మా ఊరికి బస్సొచ్చింది!

- స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి బస్సు
- ఫలించిన గ్రామస్తుల పోరాటం

**రాజోలి, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏండ్లకు పెద్ద ధన్వాడ గ్రామానికి తొలిసారి ఆర్టీసీ బస్సు వచ్చింది. చరిత్రలో ఎన్నడూ ఆ ఊరి మొఖం చూడని ఆర్టీసీ బస్సు పరుగులు పెట్టడంతో గ్రామస్తులంతా మురిసిపోయారు. రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడకి బస్సు సౌకర్యం కల్పించాలని గత 4రోజులపాటు గ్రామస్తులు, విద్యార్థులు అంతా ఏకమై ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఇందుకు స్పందించి ఆర్టీసీ అధికారులు గురువారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించారు. గ్రామానికి ఇన్ని సంవత్సరాలకు మొదటిసారి బస్సు రాకతో ఇక ఆ గ్రామప్రజల ఆనందానికి అవధులు లేవు. గ్రామస్తులంతా సంతోషంతో ఉప్పొంగిపోయారు. ఈ బస్సు ఉదయం 7 గంటలకు అయిజ నుంచి బయలుదేరి, చిన్న తాండ్రపాడు, పెద్ద ధన్వాడ గ్రామాల మీదుగా నసనూర్ గ్రామానికి చేరుతుంది. తిరిగి సాయంత్రం 5 గంటలకు అయిజ నుండి ప్రారంభమవుతుందని, ఈ సదుపాయాన్ని గ్రామస్థులు తప్పకుండా వినియోగించుకోవాలని గద్వాల జిల్లా డిపో మేనేజర్ సునీత విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ విద్యార్థులతో కార్పోరేట్ స్థాయి ర్యాంకులు సాధించిన జాగృతి

- రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు ఉమ్మడి జిల్లా 1వ ర్యాంకును సాధించిన జాగృతి విద్యార్థులను సన్మానించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 14 జనంసాక్షి :** ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పట్టణంలోని జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో బైపిసిలో ఉజ్మా హజారా 438/440 మార్కుల తో 2వ ర్యాంకును, బైపిసిలో హెచ్ అనుష్ణ 994/1000 మార్కులతో ఉమ్మడి జిల్లా ఫస్ట్ ర్యాంకును సాధించి, మరొకసారి వనపర్తిలో ప్రతిభ చాటారు, ఈ విషయాన్ని తెలుసుకున్న మాజి మంత్రి నిరంజన్ రెడ్డి జాగృతి కళాశాలకు వెళ్లి స్టేట్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు.

మాజి మంత్రి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి మార్కులతో, స్టేట్ ర్యాంకు తోపాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మొదటి ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నందుకు జాగృతి కళాశాల విద్యార్థులను అభినందించారు. జేఈఈ మెయిన్స్ 2026 సెషన్ 10 ఫలితాలలో సిహెచ్.అర్జున్ 91.69 తో జిల్లాలో అగ్రగామిగా నిలవడం సంతోషంగా ఉందన్నారు.జిల్లాలో ఇంటర్ విద్యలో ఇంటర్మీడియట్ మార్కులతో పాటు జేఈఈ నీట్ ఎపిసెట్‌లలో కూడా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జాగృతి కళాశాల నిలవడం ఎంతో సంతోషంగా ఉందని జాగృతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ నీ యజమాన్య సభ్యులు భాస్కర్ శ్యామ్ కుమార్, సత్యనారాయణలను అభినందించారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ ప్రేమ్‌నాథ్ రెడ్డి, భాగ్యరాజు హేమంత్ తదితర నాయకులు, యజమాన్య సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వ్యక్తి మృతి

**పరిగి ఏప్రిల్ 16 జనం సాక్షి :** వికారాబాద్ జిల్లా పరిగిలో రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అమాయక ప్రజల ప్రాణాల మీదకు వస్తోంది. నిబంధనల ప్రకారం కనీస జాగ్రత్తలు తీసుకోకుండా పనులు చేయడంతో ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. పరిగి మండలం రాపోలు గ్రామానికి చెందిన మొల్ల చాంద్ పాషా.. రాత్రి వేళ తన గ్రామానికి బైక్ పై బయలుదేరారు. పరిగి-షాద్‌నగర్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కల్వర్టు కోసం కాంట్రాక్టర్ మధ్యలో భారీ గొయ్యి తీశారు పనులు జరుగుతున్నాయని తెలిపే ఎలాంటి సూచికలు గానీ, హెచ్చరిక బోర్డులు గానీ అక్కడ ఏర్పాటు చేయలేదు. చీకటిలో ఆ భారీ గుంత కనిపించకపోవడంతో చాంద్ పాషా తన బైక్ తో సహా నేరుగా గుంతలో పడిపోయారు. తీవ్ర గాయాలవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కాంట్రాక్టర్ బాధ్యతారాహిత్యం వల్లే ఈ ఘోరం జరిగిందని రాపోలు గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# మొక్కజొన్న రైతుకు తక్షణమే లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి
- షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ నాయకుల బృందం



**చిగురుమామిడి ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం లోని నవాబుపేట గ్రామంలో నిన్న జరిగిన షార్ట్ సర్క్యూట్ తో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట దగ్ధం అవడం వలన విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే చేతికొచ్చిన మొక్క జొన్న పంట షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు బొల్లి లింగయ్యకు లక్ష రూపాయల తక్షణ నష్టపరిహారం అందజేసి,విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య డిమాండ్ చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో బుధవారం కాలిపోయిన మొక్కజొన్న పంటను బిఆర్ఎస్ పార్టీ నాయకుల బృందం బాధిత రైతులతో కలిసి ప్రమాదం జరిగిన తీరును గురువారం పరిశీలించారు.ఎన్నో కష్టాలు పడితే పంట చేతికి వచ్చిందని సంబర పడేలోపే ఇలా 30గుంటల్లో పంట షార్ట్ సర్క్యూట్ జరిగి పంట కాలిపోవడం చాలా బాధాకరమని బాధిత రైతు లచ్చువ్వ సంపత్ లను ఓదార్చారు.లూజు వైర్లతో ప్రమాదం జరుగుతుందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినప్పటి కీ పట్టించుకోకపోవడం,రైతుల సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహ రించడం దారుణమన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కాలిపోయిన పంటను పరిశీలించి తక్షణ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చిగురుమామిడి మండల రైతంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని,అత్యధిక ఓట్ల మెజారిటీ ఇచ్చి గెలిపిస్తే ఇక్కడి ప్రజలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.సాగునీరు అందక వందల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోతే కనీసం రైతులను పట్టించుకునే పరిస్థితి లేదని,ఈ ప్రాంత ప్రజలకు మంచి బుద్ధి చెబుతున్నారని మంత్రి తీరుపై మండిపడ్డారు.మంత్రి వెంటనే స్పందించి బాధిత రైతును ఆదుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి వేణు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అనుమల్ల సత్యనారాయణ, మాజీ మండల కో ఆప్షన్ మక్బుల్ పాషా, కూతురు శరభందర్ రెడ్డి, దోనపాటి కృష్ణారెడ్డి,దామ శ్రీనివాస్, ఎడెల్లి సంపత్, వార్డ్ సభ్యుడు ఆగయ్య, పిల్లి యాదగిరి, కూతురు వెంకట్ రెడ్డి, కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, మెడవేని బుచ్చయ్య,తదితరులు ఉన్నారు.

*అంబర్‌పేట్ : బాగ్ అంబర్‌పేట్‌లోని శివం రోడ్ వద్ద "శ్రీ బాలాజీ బిజినెస్ సొల్యూషన్స్" పేరుతో నెట్ సెంటర్ నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆధార్ కార్డుల్లో అక్రమ మార్పులు చేస్తూ, నకిలీ వివరాలను నిజమైనవిగా ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో బయటపడింది. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్ తెలిపారు.*

# 10 లక్షల నిధులతో మంచి నీటి సరఫరా

- పైపులైన్ పనులకు భూమి పూజ చేసిన మేయర్
- మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికిన 48వ డివిజన్ కార్పొరేటర్ పద్మ అనిల్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే మా పాలకవర్గ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం రోజు 48వ డివిజన్‌లో మేయర్ కొలగాని శ్రీనివాస్ విస్తృతంగా పర్యటించారు. శ్రీహరి నగర్ కాలనీలో స్థానిక కార్పోరేటర్ కర్రె పద్మ – అనిల్ తో కలిసి 15 ఆర్థిక సంఘం ద్వారా 10 లక్షల నిధులతో మంచి నీటి సరఫరా పైపులైన్ అభివృద్ధి పనులకు భూమీ పూజ చేశారు. అనంతరం డివిజన్ లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను అధికారులతో కలిసి తనిఖీ చేసి పరిశీలించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం కొసం తగిన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. చేపట్టిన పైపులైన్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోని డివిజన ప్రజలకు త్రాగు నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... శివారు ప్రాంతాల, విలీన గ్రామాల డివిజన్ల సమస్యలను ప్రాధాన్యత గా తీస్కోని దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శివారు ప్రాంతాలను, విలీన గ్రామాల డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం గా మా పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైపులైన్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా గత కొంతకాలంగా శ్రీహరి నగర్ కాలనీలో ఎదురవుతున్న మంచినీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, కొత్త పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభం చేశామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు సరిపడా తాగునీరు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కాజ రమ శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, డీఈ శ్రీనివాస్, కాలని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- 22 లక్షల కౌలు రైతులు దుస్థితిలో
- రైతు ఆత్మహత్యల్లో 80% కౌలు రైతులే
- 2011 చట్టం అమలు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి



ముషీరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి): తెలంగాణలో కౌలు రైతులను గుర్తిస్తామని, కౌలు రైతులకు అన్ని పథకాలు వర్తింపజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పలువురు ప్రజా సంఘాల మేధావులు, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బి. కొండల్ అధ్యక్షతన రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొ. హరగోపాల్, ప్రొ. కోదండరామ్, జస్టిస్ చంద్రకుమార్, కొండవీటి సత్యవతి (భూమిక), పి. శంకర్ (దళిత బహుజన ఫ్రంట్) తదితర మేధావులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో 22 లక్షలకు పైగా కౌలు రైతులు ఉన్నారని, వారు మొత్తం అన్నదాతలలో 36 శాతం ఉన్నారని సమావేశంలో వివరించారు. బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో కౌలు రైతులు అప్పుల బారిన పడి తీవ్ర దుస్థితిలో ఉన్నారని, రైతు ఆత్మహత్యలలో 80 శాతం కౌలు రైతులవేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు.

2011 భూ అధికృత సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, గ్రామ సభల ద్వారా నిర్ధారణ చేసి గుర్తింపు కార్డులు (ఎల్ఈసి) ఇచ్చి అన్ని పథకాలు, పంట రుణాలకు అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి అన్ని పథకాలు అందించినప్పుడే తెలంగాణ రైతాంగం స్థితి మెరుగుపడుతుందన్నారు.

**కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ**

"తెలంగాణ కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ" పేరుతో ప్రజా సంఘాలు, మేధావులు కౌలు రైతుల గుర్తింపు కోసం ఉమ్మడి పోరాటం చేస్తామని ప్రకటించారు. ఈ కమిటీకి ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డి. నరసింహా రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. గ్రామ స్థాయిలో కౌలు రైతులతో సమావేశాలు, సమస్యలపై సర్వే, కౌలు రైతులను గ్రూపులుగా జోడించడం, జిల్లా స్థాయి సమావేశాలు, మీడియా చర్చలు, రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని ప్రకటించారు.

సమావేశంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు ప్రొ. అరిబండి ప్రసాదరావు, తెలంగాణ విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, తెలంగాణ పీపుల్స్ జేఏసీ రవిచందర్, మీరా సంఘమిత్ర, సోషల్ డెమోక్రటిక్ ఫోరం ఎం. ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం సోమిడి శ్రీనివాస్, జక్కుల వెంకటయ్య, స్వర భారతి మహిళా సంఘం స్వప్న, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలు

- ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం : డిసిపి బి.రామ్ రెడ్డి
- ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అరైవ్- అలైవ్ కార్యక్రమం



**పెద్దపల్లి,ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మరియు ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై బాధ్యతాయుత దృక్పథం తో పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం లో భాగంగా గురువారం పెద్దపల్లి మండలం పరిధిలోని ఆర్.కే ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి. రూరల్ ఎస్ ఐ మల్లేశం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ , సీఐ పెద్దపల్లి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, మితిమీరిన వేగం మరియు ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను తగ్గించవచ్చుని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతలో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు.డిఫెన్సివ్ డ్రైవింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించి, రోడ్డు పై పరిసరాలను గమనిస్తూ ఇతరుల పొరపాట్లను కూడా ముందుగానే అంచనా వేసుకుని జాగ్రత్తగా వాహనం నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అలాగే హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం నివారించడం వంటి ప్రాథమిక భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్వో రాజయ్య ఎంపీడీఓ, రమేష్ ఎంఏఓ, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు మరియు సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దొంగ దారిన మళ్ళీ అధికారంలోకి రావడానికే డీలిమిటేషన్

- 2011 లెక్కల ప్రకారం డీలిమిటేషన్‌కు వ్యతిరేకం
- మహిళ బిల్లుకు వంద శాతం మద్దతు ఇస్తాం
- దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై ఉద్యమం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు ఎప్రిల్ 16(జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం మరోసారి అధికారం చేపట్టేందుకు డీలిమిటేషన్‌ను చేపడుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు .గురువారం మున్సిపల్ కార్యాయలంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దొంగదారిలో మళ్లీ అధికారం చేపట్టేందుకు డీలిమిటేషన్ బిల్లును ప్రవేశ పెడుతుందని విమర్శించారు. లోక్ సభ స్థానాల బిల్లులు, మహిళ రిజర్వేషన్ల బిల్లులను వేరువేరుగా ప్రవేశ పెట్టాల్సి ఉండేదని అభిప్రాయ పడ్డారు. డీలిమిటేషన్ బిల్లు పూర్తిగా అశయంగా ఉందని దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మహిళ రిజర్వేషన్ బిల్లును గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్లతో ప్రవేశ పెట్టాలని నిర్ణయించిందని గుర్తు చేశారు. బీజేపీ కొత్తగా ప్రవేశ పెడుతున్న ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. అయితే డీలిమిటేషన్ మాత్రం బీజేపీ ప్రభుత్వం నాలుగోసారి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. 2011 జనాబా ప్రకారం డీలిమిటేషన్ చేయడం లేదని అన్నారు. ఇప్పుడున్న జీఎస్టీ ద్వారా, ఆధాయ మార్గాల ద్వారా దక్షిణాది రాష్ట్రాల నుంచి లబ్దిపొందుతున్నారని అన్నారు. మహిళ రిజర్వేషన్లను అడ్డం పెట్టుకుని డీలిమిటేషన్ చేస్తున్నారని, అలా చేస్తే కేంద్రానికి పుట్టగతులు ఉండవని ఆరోపించారు. అశయంగా చేపట్టడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని అన్నారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్ తదితరులు ఉన్నారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- కాగ్నా నది నుంచి కొత్త పైపులైన్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్
- 36 వార్డుల్లో బోర్లు, ట్యాంకుల నిర్మాణం
- అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు



**తాండూరు, ఏప్రిల్ 16 (జనంసాక్షి):** తాండూరు మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. కాగ్నా నది నుంచి కొత్త పైపులైన్ వ్యవస్థ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వెల్లడించారు. గురువారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం కౌన్సిల్‌లో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే మీడియాకు వెల్లడించారు. తాండూరు పట్టణంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగ్నా నది నుంచి కొత్త పైపులైన్ వ్యవస్థ నిర్మాణానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఇందులో భాగంగా పబ్లిక్ హెల్త్ శాఖ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పట్టణాన్ని సందర్శించినట్లు తెలిపారు. కొత్త పైపులైన్ పనులు త్వరలోనే చేపట్టి కాగ్నా నది నీటిని సరఫరా చేస్తామన్నారు. అదేవిధంగా పట్టణంలోని 36 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు, ట్యాంకుల నిర్మాణం చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఇంతేకాకుండా పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కూడా సీఎం నిధులు మంజూరు చేయబోతున్నారని తెలిపారు. మరోవైపు తాండూరు పట్టణంలోని గ్రీన్ ఫీల్డ్, పారిశ్రామికం, శిఖం భూముల్లో నివాసాలను ఒక వేదికపైకి తీసుకొచ్చి మాస్టర్ ప్లాన్ అమలు చేసే యోచనలో ఉన్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. నివాసాలు ఏర్పరుచుకున్న వారికి ఇళ్ల నంబర్లు కేటాయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాండూరు పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో కొందరు రాద్ధాంతం చేస్తున్నారని, కాసే చెట్టుకు రాళ్లు రువ్వే విధంగా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమీషనర్ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు 100% సాధించడంలో సెర్ప్ సిబ్బంది కృషి చేయాలి

- బ్యాంక్ లింకేజీలో అగ్రస్థానం కొనసాగించాలి
- స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లా ముందుండాలి
- వీ-హబ్ శిక్షణలతో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



**పెద్దపల్లి, ఏప్రిల్ 15 (జనంసాక్షి):** స్వశక్తి సంఘాల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను 100 శాతం సాధించడానికి సెర్ప్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘాల కవరేజ్‌లో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లాను ముందంజలో ఉంచేలా అందరూ కృషి చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో రుణాల లక్ష్యాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జిల్లాలో మహిళల శిక్షణల సంస్థ వీ-హబ్ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీ-హబ్ శిక్షణల కోసం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మహిళలను సమీకరించి శిక్షణలకు హాజరయ్యేలా సెర్ప్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది అందరూ సమన్వయంతో కృషి చేసి అన్ని అంశాల్లో జిల్లాను అగ్రభాగంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ సమీక్షలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే. కాళిందిని, అదనపు డి.ఆర్.డి.ఓ బి. రవీందర్, డిపిఎంలు వెంకటరమణ, సంజీవ్, స్త్రీనిధి ఆర్ఎం దుర్గాప్రసాద్, ఏపీఎంలు, స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ డ్రైవ్‌లో ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని వెల్లడించారు. డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చని, ఏజే సొల్యూషన్స్, వార్కస్ ఈవీ మోటార్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెట్ల లేటెస్ట్ రెజ్యూమ్‌లు, ఫార్మల్ డ్రెస్‌లో ఉదయం 10 గంటలకు టాస్క్ రీజినల్ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

# విద్యార్థినిల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన కలెక్టర్



**బొంరాస్ పేట, ఏప్రిల్ 16( జనం సాక్షి) :** విద్యార్థినిల ఆరోగ్యం,విద్యాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారము భోజనం ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.గురువారము బొంరాస్ పేట మండలం బోట్లవానితాండ గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భాంగా గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినుల విద్యా ప్రమాణాలు మరియు ఆరోగ్య పరిస్థితులను సమీక్షించారు.తరగతి గదులను పరిశీలించి బోధన విధానాన్ని పరిశీలించారు.విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి చదువు, సౌకర్యాలు, ఆరోగ్య సమస్యలపై సమాచారం సేకరించారు.ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్య అందించడమే కాకుండా, వారి శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. 9వ తరగతి చదివే విద్యార్థినిలతో మాట్లాడుతూ వేసవి సెలవుల సందర్భంగా ఇండ్లకు వెళ్లి సెల్ ఫోన్స్ చూడటం చేయరాదని, వచ్చే సంవత్సరం పదవ తరగతికి వస్తారని, ముందుగానే తరగతి సిలబస్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, బాగా ఆచదువుకోవాలని ఆదేశించారు.పాఠశాలలో పరిశుభ్రత, పోషకాహారం, తాగునీరు, వసతి సౌకర్యాలపై ఎటువంటి లోపాలు ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆరోగ్య పరీక్షలను నిరంతరం నిర్వహించి,విద్యార్థినుల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.సిబ్బంది మరియు విద్యార్థుల హాజరు నమోదు రిజిస్టర్లను పరిశీలించారు.ఉపాధ్యాయులు విద్యార్థినుల వ్యక్తిగత అభివృద్ధి, క్రమశిక్షణ, మరియు నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని తెలిపారు.మధ్యాహ్న బోజనాన్ని పరిశీలించి, విద్యార్థినిలతో పాటు కలెక్టర్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మావతి, ఏంపిడివో వెంకన్ గౌడ్, ఏంఈవో హరిలాల్,వార్డెన్ రాజన్న, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా కేంద్రాలు కొండంత అండ

- కేంద్ర పనితీరు ను అడిగి తెలుసుకున్న అడిషనల్ డీజీపీ చారు సిన్హా
- నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని ఆదేశం
- కరీంనగర్ భరోసా కేంద్రం తనిఖీ



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో చేయూతను అందించి, వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు 'భరోసా' కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర అడిషనల్ డీజీపీ (సీఐడీ, ఏసీబీ) చారు సిన్హా పేర్కొన్నారు. గురువారం రోజు కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా కొత్తపల్లిలో ఉన్న 'భరోసా' కేంద్రాన్ని ఆమె సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలను తనిఖీ చేశారు.

**రికార్డుల పరిశీలన - సిబ్బందికి సూచనలు**

కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించిన అడిషనల్ డీజీపీ, సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సిలింగ్ అందించడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... "తెలంగాణ పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు మంచి సత్ఫలితాలను ఇస్తున్నాయని లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా పక్కాగా ఆధారాలను సేకరించాలి. బాధితులకు ప్రభుత్వం నుండి అందాల్సిన నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2024 డిసెంబర్లో ప్రారంభమైన ఈ కేంద్రం, బాధితులకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు తిరిగే ఇబ్బంది లేకుండా ఒకే చోట అన్ని సేవలు అందించడం అభినందనీయమన్నారు. తనిఖీ అనంతరం భరోసా కేంద్రం ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ పుల్లయ్య, ఎస్సై అనూష, భరోసా కేంద్రం సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు శిక్షణ... భవితకు నిచ్చనా

- ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికేట్ల ప్రదానం
- హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బండారి నరేందర్ రావు



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 16 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లా లో డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని డాక్టర్ బి.ఎన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన రెండు బ్యాచ్‌లలో 40 మంది మహిళలకు సర్టిఫికేట్ల ప్రదాన కార్యక్రమం కరీంనగర్ నాక్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ అతిథులు చైర్మన్ హెల్త్ ఫౌండేషన్ డా. బి.ఎన్. రావు, ఫౌండేషన్ సెక్రటరీ ఝాన్సీ, కార్పొరేటర్లు గుగ్గిళ్ళ జయశ్రీ కార్పొరేటర్, పడాల శ్రీజ, సుధ గొని మాధవి, చొప్పరి జయశ్రీ , నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గంగ పాల్గొన్నారు. హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డా. బి.ఎన్. రావు మాట్లాడుతూ... ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా శక్తిని మరింత ప్రోత్సహించడం మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు. భవిష్యత్తులో నాక్ సంస్థతో కలిసి మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ మహిళలకు ఆర్థికంగా, స్వావలంబన కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ , పడాలా శ్రీజ, సుధగోని మాధవి, చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ... ఈ శిక్షణ ద్వారా మహిళలు సొంతంగా ఉపాధి అవకాశాలు పొందగలగడం ఒక గొప్ప ముందడుగు అని, డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న ఆర్థిక సహకారం ఎంతో ప్రశంసనీయం అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదం చేస్తాయని జయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# దేశవ్యాప్తంగా మండుటెండలు

▫ అప్రమత్తంగా ఉండాలి : ఐఎండి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

# కాలుష్య కథనాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్పందన




ఎట్టకేలకు కాలుష్య కాసారాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు స్పందించింది. జనంసాక్షి ప్రచురించిన వరుస కథనాలకు కదిలివచ్చి పరిశ్రమలకు నోటీసులు జారీ చేసింది. కాలుష్యాన్ని కంట్రోల్ చేయాల్సిందేనని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.
- రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)

## రంగారెడ్డి జిల్లా ఎలికట్ట గ్రామంలో కాలుష్యంతో విలవిల

▫ వరుస కథనాలను ప్రచురించిన జనంసాక్షి..
▫ పరిశ్రమ యాజమాన్యాలకు నోటీసులు జారీ...
▫ విచారించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికార యంత్రాంగం..
▫ కాలుష్యం కెమికల్ రసాయన వాటర్‌ను ఇకమీదట వదలకూడదని హెచ్చరించిన వైనం..
▫ కాలుష్యాన్ని కంట్రోల్ చేయాల్సిందేనని హెచ్చరికలు..
▫ మిగతా కంపెనీలకు కూడా నోటీసులు ఇస్తాం..
▫ ఎన్విరాన్‌మెంట్ జాయింట్ చీఫ్ నరేందర్..



రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో విచ్చలవిడిగా వెలుస్తున్న పరిశ్రమ యాజమాన్యాలు రాత్రి పగలు తేడా లేకుండా విపరీతమైన కాలుష్యాన్ని వదులుతుండడంతో పాటు పరిశ్రమల నుండి వెలువడే రసాయన వ్యర్థ పదార్థాలను కెమికల్ వాటర్ ను పైపులైన్ల ద్వారా భూమి లోకి పంపడంతో పాటు చుట్టుపక్కల ఉన్న చెరువులోకి వదలడంతో నీళ్లు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయి పంచభూతాలు కలుషితం అవుతున్నాయనే కథనలను జనంసాక్షి వరుసగా ప్రచురించింది. దీంతో స్పందించిన అసిస్టెంట్ ఎన్విరాల్ మెంట్ బృందం కాలుష్యం వదులుతున్న పరిశ్రమల ప్రాంతాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించి పై అధికారులకు నివేదిక సమర్పించారు దీంతో గురువారం నాడు హైదరాబాద్ ఎన్విరాల్ మెంట్ జాయింట్ చీఫ్ నరేందర్ ఆధ్వర్యంలో పరిశ్రమ నిర్వాహకులను రసాయనిక కెమికల్ వాటర్ వదులుతుండడంపై ప్రశ్నల వర్షం కురిపించారు వెంటనే కెమికల్ రసాయన విడత పదార్థాల వాటర్ను నిలిపివేయాలన్నారు ఇది మరోసారి రిపీట్ కావొద్దు అంటూ హెచ్చరించారు చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలకు కూడా త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు..

# వడదెబ్బతో కొడుకు మృతి

▫ తట్టులోలేక తల్లి మరణం

**జోగులాంబ గద్వాల, ఏప్రిల్16 (జనంసాక్షి) :** జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు కళ్ళముందే తిరిగిన కొడుకు అనంతలోకాలకు వెళ్లగా.. ఆ వార్త విన్న తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మరణించిన గంటల వ్యవధిలోనే తల్లి కూడా కన్నుమూసింది. ఈ ఘటన అయిజ మండలం తూముకుంట గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది. గ్రామానికి చెందిన కుర్వ మల్లికార్జున్ తీవ్రమైన వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కంటిపాపలా పెంచుకున్న కొడుకు ఇక లేడన్న వార్త విన్న తల్లి కురువ రంగమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మరణవార్తను ఆమె తట్టుకోలేకపోయింది. పుట్టెడు దుఃఖంతో ఆమె గుండె ఆగిపోయింది. ఒకే ఇంట్లో తల్లీకొడుకులు మృతి చెందడంతో తూముకుంట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

# ఏఐ యుగంలోనూ మూఢనమ్మకాలు

▫ నాంచారమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు...!?



**వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్16(జనంసాక్షి):** మండలంలోని రామానుజాపూర్ గ్రామపంచాయతీ పరిధి ఎరుకల నాంచారమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపుతున్నాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున నాంచారమ్మ జాతర నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అక్కడ ఏర్పాట్లు చేసేందుకు పరిశీలనకు వెళ్ళిన వారు, చుట్టుపక్కల పంట పొలాల రైతులు నాంచారమ్మ ఆలయంగా పిలవబడే పంచకూటాలయంలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గుర్తించారు. ప్రస్తుతం ఏఐ యుగంలోనూ మూఢనమ్మకాలతో క్షుద్ర పూజలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయడం విస్తు గొలుపుతోంది. అర్ధరాత్రి పూట శ్మశానాలు, రోడ్ల కూడళ్లలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, జంతు బలులతో చేసిన పూజా ఆనవాళ్లు గ్రామీణ ప్రాంతాలలో స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో నాంచారమ్మ జాతర పరిసరాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. మరోసారి జాతరకు ముందు గుప్తనిధుల కోసం పూజలు చేశారా, క్షుద్ర పూజలు చేశారా అని పలువురు చర్చించుకుంటున్నారు.

# విపక్షాల ఐక్యతకు పరీక్షా కాలం


▫ మహిళా బిల్లుపై పరస్పర విరుద్ధ వాదనలు
▫ ఎన్నికల ప్రచారంలో బిజీగా టీఎంసీ ఎంపీలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) :** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల నేపథ్యంలో విపక్ష కూటమిలో విభేదాలు బయటపడుతున్నట్టు తెలుస్తోంది. అలాగే వారి మధ్య ఐక్యత లేదని స్పష్టం అవుతోంది. బిల్లును వ్యతిరేకిస్తే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా వారిని వెన్నాడుతోంది. పార్లమెంట్‌లో ఈ కీలక బిల్లులపై ఓటింగ్‌కు ముందు జరిగిన సమావేశంలో వివిధ పార్టీలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడమే దీనికి కారణం. కేంద్రం తీసుకొస్తున్న ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు రిజర్వేషన్ అమలును వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే.. ఈ ప్రక్రియను డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడంపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అందరూ పార్లమెంట్‌కు హాజరుకావడం కష్టమవుతోందని ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ తెలిపారు. అయితే.. టీఎం సీ వైఖరిని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. విపక్ష ఎంపీలు ఓటింగ్‌కు హాజరు కాకపోతే అది ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లే అవుతుందని హెచ్చరించినట్టు సమాచారం. అన్ని పార్టీలు తప్పనిసరిగా హాజరై బిల్లును వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా.. తమిళనాడులోనూ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ డీఎంకే ఎంపీలు పూర్తి స్థాయిలో హాజరవుతారని ఆ పార్టీ ప్రతినిధి టీఆర్.బాలు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని కొందరు విపక్ష నేతలు ఇప్పటికే తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఏది ఏమైనా మహిళా రిజర్వేషన్ బిల్లు రాజకీయంగా కొత్త సమీకరణాలకు దారితీస్తుండగా.. విపక్ష ఐక్యతకు ఇది పరీక్ష కాలంగా మారింది. మహిళల రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గ పునర్విభజన బిల్లులపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తాజాగా స్పందించారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ తమ పార్టీ వైఖరిని ముందే తెలియజేశామని అన్నారు. ఈ విషయంలో అదనంగా తాను చెప్పాల్సిందేమీ లేదని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులను గురువారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్, హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభ ముందుకు తీసుకొచ్చారు. 131వ రాజ్యాంగసవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను మంత్రి మేఘ్‌వాల్ ప్రవేశపెట్టగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాలకు సంబంధించిన బిల్లును అమిత్ షా సభ ముందు పెట్టారు. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తప్పిన ప్రమాదం

▫ రన్‌వేపై ఆగివున్న ఆకాశ్ విమానాన్ని ఢీకొన్న స్పైస్‌జెట్



**న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుంది. రన్‌వేపై ఆగి ఉన్న ఆకాశ ఎయిర్ విమానాన్ని స్పైస్‌జెట్ విమానం పక్కనుంచి ఢీకొట్టింది. అయితే, ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు ఆకాశ ఎయిర్ విమానం రన్‌వేపై ఉంది. అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం.. ఆకాశ విమానాన్ని పక్కనుంచి తాకుతూ వెళ్లింది. ఈ ప్రమాదంలో స్పైస్‌జెట్ కుడివైపు రెక్క భాగం ధ్వంసమవ్వగా.. ఆకాశ ఎయిర్ విమానం ఎడమవైపు భాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రమాదంపై ఆకాశ ఎయిర్ అధికార ప్రతినిధి స్పందించారు. ఈ ఘటనతో ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానం నుంచి కిందకు దింపాం. వారి భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. ప్రయాణికులను హైదరాబాద్ పంపించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం అని వెల్లడించారు. అటు స్పైస్‌జెట్ కూడా ప్రమాదాన్ని ధ్రువీకరించింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.

# తెలంగాణలో తప్పులతడకగా బీసీ గణన

▫ మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపణ



**హైదరాబాద్, ఏప్రిల్ 16 (జనంసాక్షి) :** తెలంగాణలో నిర్వహించిన కుల గణన గణాంకాలు పూర్తిగా తప్పుల తడకగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బీసీల అసలు జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 61 శాతం వరకు ఉన్న బీసీ జనాభాను తక్కువగా చూపిస్తూ వాస్తవాలను వక్రీకరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ను ఇప్పటివరకు అమలు చేయలేదని, కులాల వారీగా ఇచ్చిన హామీలు కూడా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. బీసీలకు తగిన రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా కేవలం పదవులు ఇస్తున్నామంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాల వివరాలు సరిగ్గా సేకరించలేదనే కారణంతోనే తెలంగాణలో కుల గణన వివరాలు బయటపెట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరగాలంటే ముందుగా కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అమలు చేయాల్సిందేనని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పొందినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 56 శాతం పైగా ఉన్న బీసీ జనాభాకు తగిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు.

# తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

▫ బేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలి
▫ మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్16 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

# దక్షిణాదిన బలం లేకనే బిజెపి కుట్రలు

▫ కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్16 (జనంసాక్షి) :** డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్రపన్నుతుందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ విమర్శించారు . సౌత్ లో బీజేపీకి బలం లేక కొత్త ఎత్తుగడ వేస్తోందన్నారు. ఓట్ బ్యాంక్ తో నార్త్ లో బలపడేలా ప్లాన్ చేస్తుందని చెప్పారు. సౌత్ స్టేట్స్ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా నిధులు వెళ్తున్నాయని చెప్పారు. డీలిమిటేషన్ తో సౌత్ కు అన్యాయం జరుగుతోందన్నారు వంశీకృష్ణ. దక్షిణాన బీజేపీపై పెరుగుతున్న వ్యతిరేకత దృష్ట్యా ఉత్తరాన సీట్లు పెంచుకొని మరోసారి అధికారం చేపట్టాలని డీలిమిటేషన్ పేరుతో కేంద్రం కుట్ర చేస్తోందని వంశీకృష్ణ అన్నారు. డీలిమిటేషన్ ద్వారా అన్ని రాష్ట్రాలకు న్యాయంగా జరగాలని డిమాండ్ చేశారు. బీజేపీ సొంతలాభం కోసం డీలిమిటేషన్‌ను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని, దీనిపై పార్లమెంట్‌లో రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370